నవతెలంగాణ

ఆదిలాబాద్

గురువారం | ఏప్రిల్ 25, 2024 | www.navatelangana.com

ఇంటర్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-మంచిర్యాల

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మంచిర్యాల కేంద్రంలో గల అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు స్టేట్ ర్యాంక్‌లు సాధించి ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సరంలో కె.అభిలాష్ ఎంపీసీలో 470 మార్కులకు 468, ద్వితీయ సంవత్సరంలో సనవర్ శిఫాలి ఎంపీసీలో 1000 మార్కులకు 991 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. స్టేట్ లెవల్‌లో అద్భుతమైన ర్యాంక్‌లు సాధించిన ఇద్దరు విద్యార్థులను అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు.



ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన జిల్లా విద్యార్థిని

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఇంటర్ బోర్డు బుధవారం ప్రకటించిన ఫలితాల్లో జిల్లా విద్యార్థిని రాష్ట్రస్థాయిలో సత్తా చాటింది. ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన కొత్తూరి అరుణ-ప్రసన్న కుమార్ దంపతుల కుమార్తె కొత్తూరి రేచల్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను 436 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. హైదరాబాద్ అమీన్‌పురలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించడం పట్ల ఆమెను తల్లిదండ్రులు, పలువురు అభినందించారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు.



అమ్మ ఆదర్శ పాఠశాల పనులు గడువులోగా పూర్తి చేయాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నవతెలంగాణ-నిర్మల్

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు ప్రారంభించి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టనున్న పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా జిల్లాలోని 672 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యాల కల్పన, మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, స్లాబ్‌ల మరమ్మత్తులు, గ్రిల్స్, సౌర ఫలకాల ఏర్పాటు ఇతర మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు తాగునీటికి సంబంధించి రెండు ట్యాప్‌ల ద్వారా ఫిల్టర్ నీటిని అందించాలని అన్నారు. నీటి అవసరాల కోసం అన్ని పాఠశాలల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు తీసుకోవాలని, అవసరమైన పాఠశాలల్లో బోర్లు వేయించాలని సూచించారు. విద్యుత్ పనుల్లో భాగంగా తరగతి గదుల్లో బోర్డు పైన, కిటికీల దగ్గర ట్యూబ్ లైట్లు అమర్చాలని, రెండు ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వరండాలో ట్యూబ్ లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటుతో పాటు పాఠశాల నేమ్ బోర్డు వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. నిధులు వృథా చేయకుండా అవసరమగు పనులు మాత్రమే చేయాలని ఆదేశించారు. కిటికీలు, తలుపులు మరమ్మత్తులు ఉంటే చేపట్టాలని, పనుల్లో నాణ్యమైన సామాగ్రిని ఉపయోగించాలని సూచించారు. పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పనులు ప్రారంభించడానికి ముందు, పనులు పూర్తి అయిన తరవాత ఫొటోలతో కూడిన నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఇప్పటికే అన్ని పాఠశాలలకు 25 శాతం నిధులు కేటాయించామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో మరుగుదొడ్లను ఈజీఎస్ కింద చేపట్టాలని సూచించారు. జిల్లాలోని కెజీబీవీలు, టీఎస్‌డబ్ల్యూఆర్‌జెసి పాఠశాలల్లోనూ పనులను చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈఓ రవీందర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు శంకరయ్య, అశోక్‌కుమార్, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ -ముధోల్

ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో మండలంలోని ఆయా కళాశాలలోని విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ముధోల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరంలో 97.5శాతం, ద్వితీయ సంవత్సరంలో 85.9శాతం ఫలితాలు వచ్చినట్లు సంబంధిత ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. ఎంపీసీలో సిహెచ్ రఘు 1000 మార్కులకు 931, బైపిసిలో క్రాంతి రతన్ 951 మార్కులు సాధించారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల కళాశాలలో ఫస్ట్ ఇయర్‌లో 97.43శాతం, సెకండియర్లో 96.87 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. సెకండ్ ఇయర్ బైపిసి విద్యార్థి బానావతి పామ బుజ్జి 969 మార్కులు, ఎంపీసీ విద్యార్థి సి.అఖిల 903 మార్కులు సాధించారు. అలాగే మైనార్టీ బాలికల కళాశాలలో మొదటి సంవత్సరంలో 93శాతం, ద్వితీయ సంవత్సరంలో 81శాతం ఉత్తీర్ణత సాధించగా ఎంపిసి విద్యార్థి రిమిషా ఖానం 925మార్కులు, బైపీసీ విద్యార్థి సానాఫాతిమ 946 మార్కులు సాధించారు. అలాగే కస్తూరిబాలో మొదటి సంవత్సరంలో 84 శాతం ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎంపిహెచ్‌డబ్ల్యు విద్యార్థి 500గాను 459 మార్కులు సాధించగా ద్వితీయ సంవత్సరం విద్యార్థి 1000మార్కులకు 922 మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్‌లో ఫస్ట్ ఇయర్‌లో 51శాతం, సెకండ్ ఇయర్‌లో 41శాతం ఒకేషినల్‌లో మొదటి సంవత్సరంలో 72శాతం, ద్వితీయ సంవత్సరంలో 74శాతం ఉత్తీర్ణత సాధించినట్లు సంబంధిత అధ్యాపకులు తెలిపారు.

ఆర్డీఓ కార్యాలయంలో ఏసీబీ దాడులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ వివి రమణమూర్తి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా భూములకు నష్టపరిహారాల్లో భారీగా అవినీతి జరిగినట్టు అందిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆర్డిఓ దత్తు, కార్యాలయ డిటి నాగోరావు, ఎంసీ భరత్‌పై ఫిర్యాదులు రావడంతో కార్యాలయంలో దాడులు నిర్వహించి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

లింగి కేజీబీవీలో 98శాతం ఉత్తీర్ణత

తలమడుగు : మండలంలోని లింగి కేజీబీవీలో 98 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రథమ, ద్వితీయ సంవవత్సర విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు ఎస్ఓ సువర్ణ తెలిపారు. ఫస్ట్ ఇయర్‌లో 55 మంది పరీక్షలు రాయగా అందులో 53 మంది పాస్ అయ్యారు. సెకండ్ ఇయర్‌లో 48 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో ఒకరు మాత్రమే ఫెయిల్ అయినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం బైపీసీలో శ్రావణి 424 మార్కులు సాధించగా, ఎంపీసీలో వాణిశ్రీ 434 మార్కులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా సెకండ్ ఇయర్ బైపిసిలో శాలిని 928, జ్యోతి 910, ఎంపీసీలో కీర్తన 890 అత్యధిక మార్కుల సాధించినట్లు ఎస్ఓ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న మున్సిపల్ సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ మున్సిపల్ సిబ్బంది మరోసారి నిజాయితీ చాటుకున్నారు. పట్టణంలోని టైలర్స్ కాలనీలోని హనుమాన్ టెంపుల్ నుండి బుధవారం సిబ్బంది చెత్త సేకరించారు. కొద్దిసేపటి తర్వాత టెంపుల్ పూజారి వచ్చి హనుమంతుని విగ్రహ వెండి పాదం చెత్తలో పడిపోయిందని మున్సిపల్ సిబ్బందికి తెలిపారు. దీంతో రాకేష్, అనిల్ చెత్తలో పడిన వెండి పాదం వెతికి పూజరికి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. దీంతో కార్మికులను పలువురు అభినందించారు.

జిల్లాకు ఎన్నికల సాధారణ పరిశీలకులు

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్ బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చారు. పట్టణంలోని పెన్‌గంగ గెస్ట్ హౌస్‌లో జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తాతో కలిసి పూల మొక్క అందించి స్వాగతం పలికారు. ఎంపీ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించి ఏమైన సందేహాలు, ఫిర్యాదులకు 8523876384 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. నేరుగా సంప్రదించాలనుకునేవారు మధ్యాహ్నం 3 గంటల నుండి 4గంటల వరకు పెన్‌గంగ గెస్ట్‌హౌస్‌లో కలవొచ్చని తెలిపారు.

దిగజారిన ఇంటర్ ఫలితాలు..!

- రాష్ట్రంలో ఏడో స్థానంలో నిలిచిన కుమురం భీం-ఆసిఫాబాద్
- వరుసగా 12, 13వ స్థానాల్లో నిర్మల్, ఆదిలాబాద్
- 30వ స్థానానికి పరిమితమైన మంచిర్యాల జిల్లా
- నాలుగు జిల్లాల్లోనూ బాలికలదే పైచేయి

ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు కొంత నిరాశ పర్చారు. గతంలో రాష్ట్రంలో మిగతా జిల్లాల కంటే మెరుగైన స్థానాలు సాధించినా ఈసారి మాత్రం వెనకబడటం గమనార్హం. గతేడాది ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిన కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా తాజాగా ఏడో స్థానానికి పరిమితమైంది. మరోపక్క నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలు వరుసగా 12, 13వ స్థానాల్లో నిలిచి ఫర్వాలేదనిపించాయి. కానీ మంచిర్యాల జిల్లా మాత్రం రాష్ట్రంలో 30వ స్థానానికి పడిపోయింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లోనూ ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలు వరుసగా 8, 9వ స్థానాల్లో నిలవగా నిర్మల్ జిల్లా 16వ స్థానంలో నిలిచింది. మంచిర్యాల జిల్లా మాత్రం 32వ స్థానంలో నిలవడం కొంత నిరాశకు గురి చేసింది. మరోపక్క ఈ నాలుగు జిల్లాల్లోనూ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో వెలువడిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో జిల్లాలో మిశ్రమ ఫలితాలు వెలువడ్డాయి. గతం కంటే కొన్ని స్థానాలు దిగజారిపోయినప్పటికీ.. ఉత్తీర్ణత శాతంలో మాత్రం విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబర్చారు. ఉమ్మడి జిల్లాలో సాధారణ విభాగంలో 23,262 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 15,242మంది ఉత్తీర్ణులయ్యారు. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 3723మంది పరీక్ష రాయగా 2503 మంది పాసయ్యారు. ప్రథమ సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 24,043మంది పరీక్ష రాయగా 13,622 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 4059మంది పరీక్ష రాయగా 2206మంది ఉత్తీర్ణులు కావడం విశేషం.

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ద్వితీయ సంవత్సరంలో 4095మంది పరీక్ష రాయగా 2951మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 1929మంది రాయగా 1176మంది పాసయ్యారు. బాలికలు 2166మంది రాయగా 1775మంది ఉత్తీర్ణులయ్యారు. 72.06 శాతంతో రాష్ట్రంలో ఏడో స్థానంలో నిలిచింది. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో జిల్లావ్యాప్తంగా 662మంది పరీక్ష రాయగా 526మంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రథమ సంవత్సరంలో 4570మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2813 మంది పాసయ్యారు. ఇందులో బాలురు 2097మంది రాయగా 982మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు 2473మంది పరీక్ష రాయగా 1831మంది ఉత్తీర్ణతతో 61.55శాతం సాధించారు. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 853 మంది పరీక్ష రాయగా 480మంది పాసయ్యారు.

నిర్మల్ జిల్లాలో ద్వితీయ సంవత్సరంలో 5475మంది పరీక్ష రాయగా 3624మంది పాసయ్యారు. ఇందులో బాలురు 2469మంది పరీక్షకు హాజరుకాగా 1313మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 3008మంది హాజరు కాగా 2311మంది ఉత్తీర్ణులవగా 66.17శాతంతో రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచింది. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో జిల్లాలో 962 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 572మంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రథమ సంవత్సరంలో 5465మంది పరీక్ష రాయగా 3064మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 2447మంది హాజరుకాగా 990మంది పాసయ్యారు. బాలికలు 3020మంది పరీక్ష రాయగా 2074మంది ఉత్తీర్ణతతో 56.05శాతం సాధించారు. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 1072మంది విద్యార్థులు పరీక్ష రాయగా 497మంది ఉత్తీర్ణులయ్యారు.

ఆదిలాబాద్ జిల్లాలో ద్వితీయ సంవత్సరంలో 8320మంది పరీక్ష రాయగా 5470మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 4114 మంది పరీక్ష రాయగా 2321మంది పాసయ్యారు. బాలికలు 4206మంది పరీక్షకు హాజరుకాగా 3149మంది ఉత్తీర్ణతతో 65.75శాతంతో రాష్ట్రంలో 13వ స్థానంలో నిలిచింది. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో జిల్లాలో 989మంది రాయగా 695మంది పాసయ్యారు.

ప్రథమ సంవత్సరంలో 8551మంది పరీక్ష రాయగా 5220మంది పాసయ్యారు. ఇందులో బాలురు 4238మంది పరీక్ష రాయగా 2194 మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు 4313మంది పరీక్షకు హాజరుకాగా 3026మంది ఉత్తీర్ణులుయ్యారు. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 1026మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 640మంది పాసయ్యారు.

మంచిర్యాల జిల్లాలో ద్వితీయ సంవత్సరంలో 5370మంది పరీక్షలు రాయగా 3197మంది పాసయ్యారు. ఇందులో బాలురు 2451 మంది హాజరుకాగా 1189మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు 2919మంది పరీక్ష రాయగా 2008మంది ఉత్తీర్ణతతో 59.53శాతం సాధించారు. రాష్ట్రంలో 30వ స్థానంలో నిలిచింది. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 1110మంది పరీక్ష రాయగా 710మంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రథమ సంవత్సరంలో 5455మంది పరీక్ష రాయగా 2525మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 2520 మంది పరీక్ష రాయా 858మంది ఉత్తీర్ణులు కాగా బాలికలు 2935 మంది పరీక్ష రాయగా 1667మంది ఉత్తీర్ణులయ్యారు. ఇదే సంవత్సరం వృత్తి విద్యా కోర్సుల్లో 1108మంది పరీక్ష రాయగా 589మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.



ఆదిలాబాద్‌టౌన్: ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఆర్ కళాశాల యాజమాన్యం



మంచిర్యాల : స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన అభిలాష్‌ను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

వినియోగం తగ్గింది..ఉపాధి పోయింది..!

- గణనీయంగా తగ్గిపోయిన మట్టి పైపుల వాడకం
- ప్లాస్టిక్ పైపుల ఉపయోగం పెరగడమే కారణం
- పరిశ్రమకు గడ్డుకాలం..కార్మికుల బతుకులు ఆగం

ఒకప్పుడు కార్మికులతో కళకళలాడిన సిరామిక్(మట్టి) పైపుల తయారీ పరిశ్రమ విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం ప్లాస్టిక్ పైపుల వాడకం పెరిగిపోవడం కారణంగా మట్టి పైపుల పట్ల ప్రజల్లో ఆసక్తి సన్నగిల్లింది. ఫలితంగా సిరామిక్ పరిశ్రమకు గడ్డుకాలం ఎదురవుతోంది. క్రమంగా కంపెనీలు నష్టాల బాటపడుతున్నాయి. గతంలో వేల టన్నులు ఉత్పత్తి చేసే సిరామిక్ కంపెనీలు తాజాగా మట్టి పైపుల వాడకం తగ్గడంతో డీలా పడిపోయాయి. దీంతో కంపెనీల్లో పని చేసే కార్మికుల సంఖ్య క్రమంగా తగ్గిపోతుంది. వేలాది మంది కార్మికులు ఉపాధికి దూరం కావాల్సిన పరిస్థితి తలెత్తింది. రోజు వారి జీవనం కొనసాగించేందుకు కార్మికులు ఇతర పనులు వెతుక్కోవాల్సిన దుస్థితి ఎదురవుతోంది. పైపుల అమ్మకాలు లేకపోవడంతో యజమానులు సైతం కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి కనిపిస్తోంది.

నవతెలంగాణ- మంచిర్యాల

ఆధునిక కాలం నుండి మట్టి పైపులను గృహ నిర్మాణాలకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, గ్రామాల్లో పారిశుధ్య పనులకు ఎక్కువ ఉపయోగించేవారు. గతంలో ఏండ్ల పాటు ఓ వెలుగువెలిగిన ఈ సిరామిక్ పరిశ్రమ తాజాగా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం ప్లాస్టిక్ పైపుల వినియోగం పెరిగిపోవడం, ఇవి మార్కెట్‌లోకి వచ్చిన నాటి నుంచి ఈ మట్టి పైపుల వాడకం పూర్తిగా తగ్గిపోయింది. క్రమక్రమంగా మట్టి పైపుల తయారీ కంపెనీలు కనుమరుగయ్యే పరిస్థితి తలెత్తుతోంది. మంచిర్యాల జిల్లాలో మొత్తం 26 మట్టి పైపుల తయారీ కంపెనీలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఈ మట్టి పైపుల తయారీ కంపెనీలు మంచిర్యాల జిల్లాలోనే అధికంగా ఉన్నాయి. ఈ పైపుల తయారీకి ఉపయోగించే బంక మట్టి , బొగ్గు సైతం మంచిర్యాల జిల్లాలోనే అధికంగా లభిస్తుంది. కరోనాకు ముందు ఒక్కో కంపెనీ ప్రతి నెల 500 నుండి 1000 టన్నుల వరకు పైపులను విక్రయించేది. కరోనా తర్వాత ఈ పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కోవడంతో ప్రస్తుతం 50 టన్నుల ఉత్పత్తి కూడా చేయలేకపోతున్నామని కంపెనీ యజమానులు చెబుతున్నారు. ముఖ్యంగా మట్టి పైపుల తయారీకి ఉపయోగించే బొగ్గు విలువ కూడా క్రమంగా పెరిగిందని చెబుతున్నారు. మట్టి పైపుల తయారీ పూర్తిగా పర్యావరణ హితంగా ఉంటుంది. మట్టిపైపులతో పోల్చితే ప్లాస్టిక్ పైపుల నాణ్యత తక్కువే. మట్టి పైపులు భూమిలో వేశాక వంద సంవత్సరాలైనా చెక్కు చెదరకుండా ఉంటాయి. ఎలాంటి సూక్ష్మక్రిములు కూడా మట్టి పైపులను పాడు చేయవని కంపెనీ నిర్వాహకులు చెబుతున్నారు. గతేడాది నెలకు రూ.10కోట్ల టర్నోవర్ చేసి, ఈ సంవత్సరం ప్రారంభం నుండి నెలకు రూ.2కోట్ల టర్నోవర్ కూడా చేయలేని పరిస్థితికి వచ్చామని ఆయా కంపెనీల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులకు ఉపాధి దూరం..!

కార్మికులకు ఏండ్ల పాటు ఉపాధి కల్పించిన ఈ సిరామిక్ కంపెనీలు ప్రస్తుతం డీలా పడిపోయాయి. గతంలో ఒక్కో కంపెనీలో సుమారు 60మంది నుంచి 100మంది వరకు ప్రతి రోజూ ఉపాధి పొందేవారు. లోడింగ్, అన్‌లోడింగ్, బట్టి ఫైరింగ్, మట్టిని తయారు చేయడం, పైపులను వాహనాల్లో తరలించడం లాంటి విభాగాల్లో కార్మికులు పని చేసి ఉపాధి పొందేవారు. క్రమంగా మట్టి పైపుల వినియోగం తగ్గడంతో కార్మికులు ఈ కంపెనీల నుండి వెళ్లిపోయి ఇతర పనులు వెతుక్కుంటున్నారు. ఒకప్పుడు మంచిర్యాల పైపుల కంపెనీలలో పని చేసి ఉపాధి పొందే వారి సంఖ్య 5వేల వరకు ఉండగా ఇప్పుడు వందల్లోకి దిగజారింది. ఒక్కో కంపెనీలో 10 నుండి 15 మంది వరకే పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. మట్టి పైపుల వాడకం తగ్గడంతో క్రమంగా కంపెనీలు మూసివేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దీంతో ఈ పరిశ్రమను నమ్ముకొని జీవించే వేలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొంది.



మట్టి పైపుల తయారీ కంపెనీ



అమ్మేందుకు సిద్ధంగా ఉన్న మట్టి పైపులు

ప్రస్తుతం పని దొరకడం లేదు : కమల, కార్మికురాలు, సోమగూడెం

నేను నా భర్త 20ఏండ్లుగా మట్టి పైపుల తయారు చేసే కంపెనీలో పనిచేస్తున్నాం. మాకు ముగ్గురు ఆడ బిడ్డలు. ఇందులో పనిచేసుకుంటూనే పోగు చేసిన డబ్బులతో ఇద్దరు పిల్లలకు పెండ్లి చేశాం. కంపెనీలో గతంలో ఉన్నంత పని ప్రస్తుతం లభించడం లేదు. ప్రతి రోజు పని కోసం వచ్చి ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. ఇదే నిత్యం కొనసాగితే బతుకుడు ఎలా అనే భయం వేస్తోంది. ప్రభుత్వం స్పందించి మట్టి పైపుల తయారీ కంపెనీలను ప్రోత్సహిస్తే మా లాంటి కార్మికులు ఎందరో ఉపాధి పొందుతారు.



ఇంటర్ ఫలితాల్లో రీజియన్ టాపర్‌గా గన్నారం గిరిజన గురుకుల విద్యార్థిని

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు బుధవారం విడుదల కాగా గన్నారంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో బైపీసీలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని నాగమల్లిక 1000 మార్కులకు 973 మార్కులు సాధించి గిరిజన గురుకుల కళాలల ఉమ్మడి ఆదిలాబాద్ రీజియన్లో టాపర్‌గా నిలిచింది. ఇదే కళాశాలలో మొదటి సంవత్సరంలో 63 మంది విద్యార్థులకుగాను 60 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 35 శాతం ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 60 మందికిగాను 60 మంది ఉత్తీర్ణులై వందశాతం ఫలితాలు సాధించారు. గన్నారం మహాత్మజ్యోతిబాపూలే కళాశాలలో మొదటి సంవత్సరంలో 47 మంది విద్యార్థులకుగాను 47 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 58 మందికి 58 మంది ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాలు సాధించారు. ఇదే కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరంలో ముక్కాల హేమాదేవి వెయ్యి మార్కులకు 984 మార్కులు సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. కాగజ్‌నగర్ కస్తూర్బా కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 32 మందికి 20 మంది ఉత్తీర్ణులై 62 శాతం ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 38 మంది విద్యార్థులకు 27 మంది ఉత్తీర్ణులై 71శాతం ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎ.శైలజ వెయ్యి మార్కులకు 968 మార్కులు సాధించగా, మొదటి సంవత్సరం ఎంపీసీలో నగోశె ప్రియాంక 470 మార్కులకు 450 మార్కులు సాధించి జిల్లాలోని ఆరు కస్తూర్బాల్లో మొదటి స్థానంలో నిలిచారు.







బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని పాత ఉట్నూర్‌లో మాజీ మంత్రి కొట్నాక్ భీంరావ్ కుమారుడు కొట్నాక్ సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్ పరామర్శించారు. బుధవారం వారి ఇంటికి వెళ్లిన ఆయన కొట్నాక్ సుధాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు బీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ మేస్రం మనోహర్, జేఏవైఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆడ హన్మంతరావ్, నాగాపూర్ మాజీ సర్పంచ్ జాదవ్ సునీల్, సామాజిక కార్యకర్త అంజాద్ ఖాన్, ఆదివాసీ నాయకులు గేడం మారుతి, మాడవి బాలాజీ, అత్రం ప్రకాష్, మాడవి శంకర్, సిరాజోద్దిన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచార రథం ప్రారంభం

నవతెలంగాణ-నార్నూర్



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ ప్రచార రథాన్ని ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుడిమేత విశ్వనాథ్, పార్టీ మండల అధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండేలు బుధవారం మండల కేంద్రంలోని ఖాందేవునికి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బ్రీజులాల్, జేఏసీ మాజీ చైర్మన్ రాథోడ్ ఉత్తం, మాజీ ఉప సర్పంచ్ షేక్ దాదేఅలీ, కో ఆప్షన్ మెంబర్ దస్తగిర్, ప్యాక్స్ డైరెక్టర్ కాంతారావ్ దుర్గే, నాయకులు కరీం ఖాన్, రాథోడ్ దత్తారాం, డిగంబర్, కాంగ్రెస్ యువ నాయకుడు మహేందర్, గోవింద్, యూత్ అధ్యక్షులు సెక్ నసీర్, అయ్యూబ్, రమేష్, శ్యాంసుందర్, అశోక్, అరవింద్, గోవింద్, దేవరావ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి



నవతెలంగాణ-ఉట్నూర్

విద్యుత్ కోతల సమస్యలను వెంటనే పరిష్కారించాలని కోరుతూ మండలంలోని లింగోజితండా ఎక్స్ రోడ్డు గ్రామస్తులు కోరారు. బుధవారం విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందించి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ కోతల కారణంగా ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు తమ సమస్యలను పరిష్కరించేల చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యూ నలందా పాఠశాల కరెస్పాండెంట్ జాదవ్ వసంత్ రావు, గ్రామస్తులు జాదవ్ జగదిష్, రవి కుమార్, హిరామన్, సంజీవ్, మహేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

మండలంలో బీఆర్ఎస్ ప్రచారం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని పలు గ్రామాలలో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు తరపున మండల నాయకులు బుధవారం ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు గతంలో చేసిన పలు అభివృద్ధి పనులను వివరిస్తూ గడపగడపకు ప్రచారాన్ని కొనసాగించారు. ప్రచార కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వెంకటేష్, ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, కిరణ్ కుమార్, ప్రకాష్, జనార్ధన్, రమాకాంత్, చంటి, పిడుగు అభిరామిరెడ్డి, దేవరావు, గంగారెడ్డి, ఆశన్న యాదవ్, పోచ్చన్న, రాంబాయి, రమేష్, గజానంద్ పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు



నవతెలంగాణ-నేరడిగొండ


ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో పేల్యాడ్ హారతి 858, బైపీసీ విభాగంలో సముద్రాల అభినయశ్రీ 900, సీఈసీ విభాగంలో జాదవ్ పృథ్వీరాజ్ 727, ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో మౌనిక 368, అలాగే బైపీసీ విభాగంలో అశ్విని 357, సీఈసీ విభాగంలో లింగు 359 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 130 మంది విద్యార్థులకు 117 మంది, ప్రథమ సంవత్సరంలో 132 మందికి 87 మంది ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు.

సత్తాచాటిన కేజీబీవీలు విద్యార్థులు

మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులు సత్తాచాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 1000 మార్కులకు గాను సుష్మిత 925, బైపీసీలో జి.అంజలి 906 మార్కులు సాధించినట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత తెలిపారు.

తప్పుడు హామీలిచ్చిన రేవంత్‌రెడ్డి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి
- నామినేషన్ వేసిన బీజేపీ అభ్యర్థి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల ప్రచార సభలో సీఎం రేవంత్ రెడ్డి తప్పుడు హామీలు ఇచ్చారని బీజేపీ సీఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. బుధవారం పార్టీ అభ్యర్థి గోడం నగేష్ నామినేషన్‌కు ఎమ్మెల్యేలు పాయల శంకర్, రామారావు పటేల్, పాల్వాయి హరీష్ బాబుతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో అభ్యర్థి నగేష్‌తో కలిసి ఆర్ఓ, కలెక్టర్ రాజర్షి షాకు నామినేషన్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఆచరణకు నోచుకోని హామీలు ఇస్తున్నారన్నారు. ఇటీవల ఆదిలాబాద్‌లో జరిగిన సభలో సీసీఐ, తుమ్మిడిహెట్టి, కుప్టి ప్రాజెక్టు ఇతర పనులు చేస్తామని ప్రకటించరన్నారు. ఇవీ సాధ్యం కావని, కేవలం ప్రజలకు తప్పుదోవ పట్టించడమేనని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ మాటలు నమ్మే స్థితిలో లేరని, బీజేపీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ మూడవ సారి కూడా పీఎంగా నరేంద్ర మోదీని చూడాలని ప్రజలు అనుకుంటున్నారన్నారు. దానికి అనుగుణంగానే ప్రజలు కూడా సహకారం అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 17 స్థానాల్లో ఆదిలాబాద్ పాటు అత్యధిక స్థానాలు బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. ఒకేరోజు నాలుగు సెట్ల నామినేషన్ వేసినట్లు అభ్యర్థి నగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలిపిస్తే ప్రజల సేవ కోసం సమయం కేటాయిస్తా

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ



ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తనకు ఓటేసి గెలిపిస్తే ప్రజల సేవకోసం తన పూర్తి సమయాన్ని కేటాయిస్తానని ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం ప్రజాసేవ భవన్‌లో చేరికల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జైనథ్ మండలం నిరాల గ్రామస్తులు మైనారిటీ నాయకులు ఖయ్యూమ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. అలాగే ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీ, విద్యానగర్, బంగారి గూడ కాలనీల నుండి వచ్చి కాంగ్రెస్‌లో చేరారు. వారందరికీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల వారీగా నేతలు కార్యకర్తలు ప్రచారం నిర్వహించాలన్నారు. వచ్చేది ట్రిబుల్ ఇంజన్ సర్కార్ అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కౌన్సిలర్లు దర్శనాల లక్ష్మణ్, రషీద్ ఉల్ హాక్, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి, శ్రీలేఖ, కొండ గంగాధర్, ఎంఏ షకీల్, సయ్యద్ షాహిద్ అలీ, రాజ్ మొహమ్మద్, దొగ్గలి రాజేశ్వర్, ప్రభాకర్, కందుల సుకేందర్, సంజీవ్ రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం ముమ్మరం

ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ పట్టణంలో ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో వాకింగ్‌కు వచ్చిన వారిని కలిసి వారితో కాసేపు వాకింగ్ చేస్తూ మాట్లాడారు. చేతి గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం కలెక్టర్ చౌక్‌లో ప్రచారం నిర్వహించారు. అక్కడ ఓ హోటల్ వద్ద వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిశారు. తనకు ఓటేసి గెలిపించాలని ఆత్రం సుగుణ వారిని అభ్యర్థించారు. ఎన్టీఆర్ చౌక్‌కు చేరుకున్నారు. చౌక్ లోని పలు హోటళ్ల, దుకాణాలకు వెళ్లి కరపత్రాలు పంచి చేతి గుర్తుకు ఓటేయాలని కోరారు. పాదాచారులను కలిసి తనకు ఓటేసి గెలిపించాలని ఆత్రం సుగుణ అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొండ గంగాధర్, పత్తి ముజ్జు, రఫీఖ్, భరత్ వాఘ్మరే, ఖయ్యూం, మహేందర్, నాగర్కర్ శంకర్, నాయకుఉలు కార్యకర్తలు పాల్గొన్నారు.

బేల : పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. మండల కేంద్రంలో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి బుధవారం భారీ రోడ్ షో నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా రోడ్ షో కొనసాగింది. దారిపొడవునా అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. జై కాంగ్రెస్ జైజై కాంగ్రెస్ నినాదాలతో బేల మండల కేంద్రం దద్దరిల్లింది. రోడ్ షోలో నాయకులు కార్యకర్తలు ప్రచార కరపత్రాలు పంచుతూ స్టిక్కర్లు అతికిస్తూ చేతి గుర్తుకు ఓటేయాలని కోరారు. అంబేద్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేశారు. కుట్టు మిషన్ తొక్కి ఆత్రం సుగుణ ఓటర్లను ఆకట్టుకున్నారు. అనంతరం ఛాయ్ హోటల్ వద్ద ఛాయ్ తయారు చేశారు. బుధవారం వారంతపు సంత కావడంతో మార్కెట్లో అమ్మకం దారులు కొనుగోలు దారులతో మాట్లాడుతూ తనకు ఓటేయాలని సుగుణ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావార్, మాజీ మార్కెట్ చైర్మన్ వామన్ రావ్ వాంఖడే, పార్టీ మండల అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, ఎస్టీ సెల్ అధ్యక్షులు మడావి చంద్రకాంత్, సుదాం రెడ్డి, ఎంపీటీసీ నగేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం బోథ్ మండలం కౌటా(బి) గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘ నాయకుటు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కండువాలను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతం కోసం పని చేయాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు అల్లూరి ప్రఫుల్ చందర్ రెడ్డి, నాయకులు రాజు రెడ్డి, సాయన్న పాల్గొన్నారు.



బేల



నేరడిగొండ

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

- ఇంటర్ బోర్డు అధికారి రవీందర్ కుమార్
- మీడియాతో ఫలితాల వివరాలు వెల్లడి
- నేటి నుండి సప్లిమెంటరీకి దరఖాస్తులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్ పలితాల్లో జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభను కనబర్చారని ఇంటర్ బోర్డు అధికారి రవీందర్ కుమార్ తెలిపారు. బుధవారం ఇంటర్ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఫలితాల వివరాలను వెల్లడించారు. గత సంవత్సరం కంటే ఈ సారి ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఫలితాలు తగ్గాగ, మొదటి సంవత్సరంలో మెరుగుపడ్డాయని తెలిపారు. గత సంవత్సరం 10, 12 స్థానాల్లో ఉండగా మొదటి సంవత్సరంలో 9వ, ద్వితీయ సంవత్సరంలో 13వ ర్యాంకును జిల్లా సాధించింది. ప్రతిసారి లాగే ఈ సంవత్సరం కూడా బాలికలే పైచెయ్యి సాధించారు. బాలుర కంటే బాలికలే అధికంగా ఉత్తీర్ణులయ్యారు. గతం సంవత్సరంతో పోలిస్తే ఈసారి ఫలితాలు ముందుగానే అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇంటర్ బోర్డు అధికారి రవీందర్ కుమార్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి 9577 మంది పరీక్షలకు హాజరు కాగా 5860 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఇందులో బాలికలు 3426, బాలురు 2434 కాగా సెకండ్ ఇయర్‌లో 9309 పరీక్షలకు హాజరు కాగా 6165 మంది పాస్ అయ్యారన్నారు. ఇందులో బాలికలు 3595, బాలురు 2570 మంది ఉన్నారన్నారు. ఆన్‌లైన్ నుంచి విద్యార్థులు షార్ట్ మెమోలను పొందవచ్చని తెలిపారు. ఫలితాల కోసం ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఈనెల 25 నుంచి మే 2వ తేది రీవేరిఫికేషన్, రీ కౌంటింగ్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. మే 24 నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలుంటాయని తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు సంబంధిత కళాశాలలో పరీక్ష ఫీజులు చెల్లించుకోవాలని సూచించారు.

శిక్షణ సమయంలో క్రమశిక్షణ తప్పనిసరి

- ఎస్పీ గౌస్ ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శిక్షణ తీసుకుంటున్న ప్రతి ఒక్కరికి సమయపాలన, క్రమశిక్షణ తప్పనిసరిగా ఉండాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న వివిధ జిల్లాల నుండి వచ్చిన 255 శిక్షణ కానిస్టేబుళ్ల శిక్షణ కేంద్రాన్ని ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకుంటున్న కానిస్టేబుల్ ఆయుధాలపై ఉన్న పరిజ్ఞానాన్ని పరిశీలించారు. అదేవిధంగా వలు రకాల ఆయుధాలు వాటి సామర్థ్యం, వినియోగించే పద్ధతి తదితర అంశాలపై కానిస్టేబుళ్లకు వివరించారు. ఫైరింగ్ చేసే పద్ధతులు, ఎటువంటి అపాయం కలగకుండా ఉండే శత్రువులను మట్టుపెట్టే అంశాలపై వివరించారు. ఆయుధాలపై పూర్తి పరిజ్ఞానాన్ని ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని తెలియజేశారు. ఫైరింగ్‌లో మెలకువలను శిక్షణ కానిస్టేబుళ్లకు తెలిపారు. నూతన పద్ధతులు, మెలకువలను ఉపయోగించడం వల్ల ఖచ్చితమైన లక్ష్యాలను ఛేదించే ఫైరింగ్ చేయవచ్చని తెలియజేశారు. అలాగే కానిస్టేబుళ్లకు శిక్షణా సమయంలో అందజేస్తున్న సదుపాయాలను, లోటుపాట్లను శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్, అదనపు ఎస్పీ సి.సమైయ్ జాన్ రావును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఎస్సైలు ఎస్ రాకేశ్, పి.గోపికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్ వ్యక్తిగత ఆరోపణలు చేశారు

- పట్టణంలో బీజేపీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీ
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, బీజేఎల్పీ నేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తనపై మాట్లాడానికి ఏమి లేకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి తనస్థాయి మరిచి వ్యక్తిగతంగా ఆరోపణలు చేశారని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. తన రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చలేకుండా ప్రజలకు సేవ చేశానని తెలిపారు. బుధవారం బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ నామినేషన్ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక రాంలీలా మైదానం నుంచి ఆదివాసీ సంప్రదాయ నృత్యం గుస్సాడి, డోలు వాయిస్తు ర్యాలీ సాగింది. వాహనంలో అభ్యర్థితో పాటు సీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఆదిలాబాద్, ముథోల్, సిర్పూర్ ఎమ్మెల్యేలు పాయల శంకర్, రామరావ్ పటేల్, పాల్వాయి హరీష్ బాబుతో పాటు జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, పార్లమెంట్ ప్రభారి అల్లాపూరే శ్రీనివాస్, నాయకులు అయ్యన్నగారి భూమయ్య, లాలామున్న, జ్యోతి రెడ్డి తదితరులున్నారు. ర్యాలీ కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని గోడం నగేష్ హామీ ఇచ్చారు. ఈ సారి తనకు ఎంపీగా అవకాశం ఇవ్వాలని కోరారు.

కేజీబీవీ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ-జైనథ్



ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలోని ఇంటర్మీడియట్ రెండవ సంవత్సర విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత చెంది అహో అనిపించారు. పట్టుదలతో చదివితే ఏదైనా సాధించి చూపించవచ్చని వారి కృషితో తెలియపరిచారు. ద్వితీయ సంవత్సరానికి చెందిన సీఈసీ విద్యార్థి స్ఫూర్తి 1000కి 908 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించటంతో పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-బేల



దీపిక



శ్రద్ధ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాలలో ప్రతిభను కనబర్చారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో దీపిక 937, ఎంపీసీలో హారిక 887 సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో మౌనిక 433, సీఈసీలో రావుత్ ధనుశ్రీ 419 మార్కులు సాధించారు. మరాఠీ మీడియం ద్వితీయ సంవత్సరం సీఈసీలో శ్రద్ధ 777, ప్రథమ సంవత్సరం సీఈసీలో సువర్ణ 318 మార్కులు సాధించి ప్రతిభను కనబర్చారు. కళాశాల ప్రిన్సిపల్ సూర్యప్రకాష్ ఫలితాలు వివరిస్తూ మొదటి సంవత్సరంలో 85 శాతం, ద్వితీయ సంవత్సరంలో 86 శాతంతో ఫలితాలు వచ్చాయని తెలిపారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఇంటర్ ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయి

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విడుదలైన ఇంటర్మియంట్ పరీక్ష ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. మొదటి సంవత్సరం పరీక్షల్లో మొత్తం 390 విద్యార్థులు పరీక్షలు రాయగా 282 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రెండవ సంవత్సరంలో 315 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 264 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. ద్వితీయ సంవత్సరం సీఈసీలో కొడపా అంజు 925, ఎంపీసీలో తుమ్మల అంకిత 900, బైపీసీలో 896 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో సీఈసీలో బండారి ప్రమోద్ 287, ఎంపీసీలో 355, బైపీసీలో 370 మార్కులు సాధించి కాలేజీ టపర్లుగా నిలిచారు.

కుభీర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల బుధవారం విడుదలైన ఫలితాల్లో సత్తాచాటారు. ప్రథమ సంవత్సరంలో 92శాతం, ద్వితీయ సంవత్సరంలో 97శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ పి సునీల్ కుమార్ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో కే.రాజేష్ ఎంపిసి విభాగంలో 470కి 455, శివాని బైపీసీ విభాగంలో 440కి 402, ద్వితీయ సంవత్సరంలో సత్యపాల్ బైపీసీ 1000కి గాను 961, పల్లవి ఎంపీసీలో 934, శివప్రసాద్ సీఈసీ 811 మార్కులు సాధించారు. కాగా వీరిని ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ఐకే-1ఏ గనిలో విద్యుత్ ప్రమాదం

నవతెలంగాణ-జైపూర్

ఇందారం-1ఏ గనిలో బుధవారం ఉదయం షిఫ్టులో విద్యుత్ ప్రమాదం చోటు చేసుకున్నట్లు విశ్వసీయ సమాచారం. భూ గర్భ గనిలోని వెల్డింగ్ ప్లాంట్ కనెక్షన్ తొలగిస్తున్న క్రమంలో ఎలక్ట్రీషన్ బొడ్డు తిరుపతి గాయపడినట్లు తెలిసింది. సంబంధిత అధికారుల ఒత్తిడి కారణంగా విధుల్లో ఉన్న సూపర్‌వైజర్ షిస్టమ్ షెడౌన్ చేయకపోవడంతో విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్న ఎలక్ట్రీషన్ ప్రమాదానికి గురైనట్లు సమాచారం. ప్రమాదం జరిగిన విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డ అధికారులు గాయపడిన బొడ్డు తిరుపతిని ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. కనీసం రిపోర్టు రాయకుండా గాయపడిన తిరుపతిని ఆస్పత్రికి తరలించగా తిరుపతి ఏ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడో కూడా తెలియకుండా అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు.

ఇంటర్ ఫలితాలలో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-లక్ష్మణచాంద



శైలజ



రక్షిత

ఇంటర్ ఫలితాల్లో మండలంలోని కేజీబీవీ విద్యార్థినిలు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ప్రత్యేక అధికారిణి నవిత చొరవ, సిబ్బంది నిర్విరామ కృషితో అత్యుత్తమ ఫలితాలు వచ్చాయి. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 432 మార్కులతో రాఘవి, బైపీసీ విభాగంలో 400 మార్కులతో శైలజ, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 907 మార్కులతో రాధిక, ఎంపీసీ విభాగంలో 972 మార్కులతో రక్షిత జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చారు. కేజీబీవీ ప్రత్యేక అధికారిణి నవీత చొరవతో తాము ఉత్తీర్ణులయ్యామని విద్యార్థులు తెలిపారు.

ప్రభంజనం సృష్టించిన ముత్నూర్ గురుకులం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి





ఇంటర్మీడియట్ ఫలితాల్లో ముత్నూర్ మెండాపల్లి గురుకులం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఆ కళాశాలలో మొదటి సంవత్సరంలో 75 విద్యార్థులకు గాను 74 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 71 మందికి 71 మంది 100శాతం విద్యార్థులు పాసయ్యారు. ఎంపీసీలో ఆర్.నవ్య 921 మార్కులు, బైపీసీలో వీహెచ్ ప్రీతీ 946 మార్కులతో మండల టపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపల్ పెందూర్ ప్రియ తెలిపారు. కళాశాల సిబ్బందితో పాటు ఐటీడీఏ అధికారులు విద్యార్థులను అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | ఏప్రిల్ 25, 2024 | www.navatelangana.com

గర్భిణికి రక్తందానం చేసిన మాజీ సర్పంచ్

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని పెర్కపెల్లి గ్రామంలోని పాకిడి గ్రామానికి చెందిన కొట్నాకె కల్లుబాయి ఐదు నెలల గర్భవతి. ఆమెకు బి పాజిటివ్ రక్తం అవసరముందని సమాచారం తెలుసుకున్న వాంకిడి మాజీ సర్పంచ్ బండె తుకారాం ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తనిధి కేంద్రానికి వచ్చి ఐదో సారి రక్తదానం చేశారు. మాజీ సర్పంచ్ బండె తుకారాంకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఒకరి ప్రాణం కాపాడవచ్చని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

మంత్రి సీతక్క సభకు ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ-బెజ్జూరు



ఈ నెల 27న బెజ్జూరు మండల కేంద్రానికి ఎన్నికల ప్రచార నిమిత్తం జిల్లా మంత్రి సీతక్క రానుండడంతో సభా స్థలాన్ని బుధవారం మండల కాంగ్రెస్ నాయకులు డోకె వెంకన్న, బశరథ్‌కాన్, నరేందర్‌గౌడ్, తాజొద్దీన్, జావీద్ పరిశీలించారు. సీతక్కతో పాటు ఎంపీ అభ్యర్థి సుగుణక్క, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్, మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్ప, కుమురం భీం జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణారావు కూడా హాజరవుతున్నారని, సభను విజయవంతం చేయాలని వారు కోరారు. వారి వెంట నాయకులు అమిరుద్దీన్, దుర్గం దుర్గయ్య, షౌకత్ అలీఖాన్, దూపం శ్రీనివాస్, ముడిమడుగుల పెంటయ్య ఉన్నారు.

జిల్లా టాపర్‌గా కోబ్రాగడె సాక్షిత్‌కుమార్

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న కోబ్రాగడె సాక్షిత్ కుమార్ 1000 మార్కులకు గాను 964 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారు. బైపీసీ రెండవ సంవత్సరంలో 162 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 159 మంది ఉత్తీర్ణులయ్యారు. 90.14 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ రెండవ సంవత్సరం బైపీసీలో డోంగ్రె అర్జున్ 1000 మార్కులకు గాను 961 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచారు. మొదటి సంవత్సరంలో మొత్తం 160 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 130 మంది ఉత్తీర్ణులయ్యారు. 81.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. బైపీసీ రెండవ సంవత్సరం చదువుతున్న సందేశ్ 1000 మార్కులకు 909 మార్కులు, ఇందుమతి 1000 మార్కులకు గాను 860, సీఈసీలో విష్ణు 1000 మార్కులకు గాను గాను 837 మార్కులు, బి వేణు 1000 మార్కులకు గాను 779 మార్కులు, ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న సుచిత్ర 470 గాను 440, ఎస్ స్వప్న 470కి గాను 439, బైపీసీలో సోను 440కి 415, విశాని 440కి గాను 414, సీఈసీలో ఇ రాజేశ్వర్ 600 మార్కులకు గాను 426, సాయికుమార్ 600 మార్కులకు గాను 405 మార్కులు సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-దహెగాం



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో దహెగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పాలె అంజలి బైపీసీ ద్వితీయ సంవత్సరంలో 924 మార్కులతో మండల్ టాపర్‌గా నిలిచింది. అలాగే కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం హస్తబిందు బైపీసీ ద్వితీయ సంవత్సరంలో 908 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరానికి చెందిన 79 మంది విద్యార్థులకు గాను 63 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరానికి చెందిన 88 మంది విద్యార్థులకు గాను 75 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరితో పాటు మరికొంతమంది విద్యార్థులు సైతం మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించగా కళాశాల సిబ్బంది, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాళ్లు అమరేందర్, రిజ్వాన అభినందించారు.

ఇంటర్‌లో తగ్గిన ఉత్తీర్ణత

- జూనియర్ కళాశాలలో 38 మంది విద్యార్థులు ఫెయిల్

నవతెలంగాణ-బెజ్జూరు



అక్షిత

ప్రతి సంవత్సరం 90 నుండి వంద శాతం ఉత్తీర్ణత సాధించే ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ ఈ సంవత్సరం ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం భారీగా తగ్గింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 131 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 93 మంది ఉత్తీర్ణత సాధించగా 38 మంది విద్యార్థులు అనుత్తీర్ణులయ్యారు. కేజీబీవీలో మొదటి సంవత్సరం 52 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 32 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ప్రతి సంవత్సరం మంచి ఉత్తీర్ణత సాధిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ పాఠశాలలో ఈ సంవత్సరం 70 శాతం ఉత్తీర్ణత సాధించలేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్వితీయ సంవత్సరంలో 120 మందికి గాను 105 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం భారీగా తగ్గింది.

ఇంటర్ ఫలితాల్లో సత్తా...

ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో బెజ్జూరుకు చెందిన రాచకొండ అక్షిత సత్తా చాటింది. ఎంపీసీ మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను 462 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

ఉపాధి హామీ పనులు పకడ్బందీగా చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో చేపడుతున్న పనులు నిర్లక్ష్యం చేయకుండా పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. డీఆర్‌డీఓ సురేందర్‌తో కలిసి ఉపాధి హామీ పనులకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య తగ్గడంపై అసహనం వ్యక్తం చేశారు. కారణాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ అవసరాల మేరకు ఉపాధి హామీ పనుల తీర్మానాలు చేయాలని, అర్హులైన కూలీలందరికీ పని కల్పించాలన్నారు. కూలీల హాజరు సంఖ్యను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. పని ప్రదేశాల్లో వేసవిదృష్ట్యా తాగునీటి వసతితో పాటు అవసరమైన వసతులు కల్పించాలని ఆదేశించారు. పనుల పరిస్థితిని ఎప్పటికప్పుడు ఎంపీడీఓలు పరీక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-రెబ్బెన

విద్యుత్ సరఫరాలో గురువారం అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా గురువారం ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే
- కాగజ్‌నగర్, సిర్పూర్(టి)లో పోలింగ్ కేంద్రాల పరిశీలన



కాగజ్‌నగర్ రూరల్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడుగుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలలలో పనులు త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం పట్టణంలోని హరిజనవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మండలంలోని జంబుగ గ్రామంలో పోలింగ్ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులతో పాటు మాకిడి గంగయ్య నగర్ కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుదీకరణ, తాగునీరు, మరమ్మతు పనులు చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో వేసవి సెలవులలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అత్యవసర పనులకు ప్రాధాన్యతనిచ్చి రూపొందించిన కార్యచరణ ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని, రూఫ్ లీకేజీని అరికట్టేందుకు కెమికల్ ట్రీట్మెంట్ చేయాలని సూచించారు. విద్యుత్, మూత్రశాలల సౌకర్యాలు కల్పించిన అనంతరం మిగులు నిధులను చిన్న తరహా మరమ్మత్తులకు వినియోగించాలని అధికారులకు సూచించారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు పూర్తి స్థాయిలో ఉండే విధంగా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల సంబంధిత పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా మే 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజున అన్ని పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్ సరఫరా, నీడ, మూత్రశాలలు ఇతరత్రా సౌకర్యాలతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులున్నారు.

సిర్పూర్(టి) : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని సిర్పూర్‌లో ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని జిల్లా పాలనాధికారి వెంకటేశ్ దోత్రె అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని జక్కాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 13న జరుగనున్న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, మూత్రశాలలు, ఇతరాత్ర సౌకర్యాలతో పాటు వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్నికలు సజావుతగా సాగేందుకు ప్రత్యేక బృందాలను నియమించడంతో పాటు ఎన్నికల ప్రక్రియకు అవసరమైన అధికారులు సిబ్బందిని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నియమించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేసే నగదు, బంగారం, మద్యం, ఇతర కానుకల తరలింపు నియంత్రించేందుకు చెక్‌పోస్టు అధికారులు ప్రత్యేక బృందాలు చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సిర్పూర్(టి) : పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రె

ఇంటర్ ఫలితాల్లో జిల్లా వెనుకంజ

- ఇంటర్మీడియట్ ద్వితీయ ఫలితాలో 7వ స్థానం
- సత్తా చాటిన ప్రభుత్వ కళాశాలలు



విద్యార్థులను సన్మానిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియట్ సెక్రెటరీ శృతి ఓజ బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఫలితాలలో కుమురం భీం జిల్లా 72.06 శాతం ఫలితాలతో 7వ స్థానంలో నిలిచి గత ఫలితాలకు భిన్నంగా వచ్చింది. గత సంవత్సర ఫలితాలతో పోలిస్తే 8 శాతం తగ్గి ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో ఏడవ స్థానం సంపాదించింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో 61.55 శాతంతో 8వ స్థానంలో నిలిచింది.

సత్తా చాటిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు

ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. మహాత్మ జ్యోతిబాపూలే కళాశాల గన్నారం విద్యార్థిని హేమదేవి 1000కి గాను 984 మార్కులు సాధించి జిల్లా సెకండ్ టాపర్‌గా నిలువగా, ఆసిఫాబాద్ మోడల్ స్కూల్ విద్యార్థినిలు పూజిత, అక్షయలు 983 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు.

రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచిన జిల్లా

జిల్లాలోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థుల్లో 4095 మంది పరీక్షలకు హాజరు కాగా 2951 మంది ఉత్తీర్ణులు కాగా 72 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 7వ స్థానంలో నిలచింది. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ ఫలితాల్లో 662 మందికి 526 మంది ఉత్తీర్ణత (79 శాతం 2వ స్థానం) సాధించారు. ప్రథమ సంవత్సరం జనరల్ ఫలితాల్లో 4570 మంది విద్యార్థులకు గాను 2813 మంది ఉత్తీర్ణత సాధించారు. (61.55శాతం ఉత్తీర్ణతతో 8వ స్థానం), ప్రథమ సంవత్సరం ఒకేషనల్ ఫలితాల్లో 853 మంది విద్యార్థులకు గాను 480 మంది ఉత్తీర్ణత సాధించి (56.27 శాతం ఉత్తీర్ణతతో 9వ స్థానం) సంపాదించారు.



టి.అక్షయ

స్ఫూర్తి

అక్షయ



మెరిసిన ఆదర్శ కళాశాల విద్యార్థులు

జిల్లా కేంద్రంలోని ఆదర్శ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచగా వారిని ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్ అభినందించారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 140 మందికి 124 మంది (88.6శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రథమ సంవత్సరంలో 140కి 130 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో బూరం అక్షయ 983, వొజ్జల పూజిత 983 మార్కులతో జిల్లా టాపర్లుగా నిలవగా కొప్పుల హర్షత 974, ఎస్.సలోని 973, ఏ.నాగమణి 965, బి.జ్యోతి 965, జి.హర్షిత 961, చిదం కార్తిక్ 952 మార్కులు సాధించారని, బైపీసీ గ్రూప్‌లో కే.శ్రావ్య 966, టి.సౌమ్య 966, యం.మేఘన 962 మార్కులు సాధించగా సీఈసీ గ్రూపులో యం.అఖిల 944, పి మనూష 912, ఎంఈసీలో ఈ.శిరీష 915, డి.తిరుమల 900 మార్కులు సాధించారని, మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో అదీబా తెహ్రీమ్ 470కి గాను 457, యం.శ్రీహర్షిత 454, కే.సమత 452, బైపీసీలో అల్లె శ్రావణి 440కి గాను 416, ఎస్.ప్రణీత 405, సీఈసీలో సుపర్ణ మండల్ 435, చౌదరి వైష్ణవి 432 మార్కులు సాధించారన్నారు.

మెరిసిన మాతృశ్రీ కళాశాల విద్యార్థులు

జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో ద్వితీయ స్థానం సంపాదించి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల డైరెక్టర్లు ప్రసాద్, బాలాజీ, లింగమూర్తి తెలిపారు. తమ కళాశాల చెందిన ఎంపీసీ మొదటి సంవత్సరం విద్యార్థిని కే.అక్షయ 458 మార్కులు సాధించిందని, బైపీసీలో స్ఫూర్తి 418, ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో టి.అక్షయ 974తో జిల్లాలో ద్వితీయ స్థానం సంపాదించినట్లు పేర్కొన్నారు.

మరింత ఉత్తమ ఫలితాల కోసం కృషి

-నైతం శంకర్, జిల్లా మాధ్యమిక విద్యాధికారి

గత సంవత్సర ఫలితాలతో పోల్చినప్పుడు ప్రస్తుత సంవత్సరం ఫలితాలు తగ్గాయి. వీటిపై భవిష్యత్తులో సమీక్ష నిర్వహించడంతో పాటు ఫలితాలు తగ్గుదలకు కారణాలు అన్వేషిస్తాం. అవి పునరావృతం కాకుండా ప్రయత్నం చేస్తాం. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుభాకాంక్షలు.

ఖైరిగూడ ఓసీని సందర్శించిన సీఅండ్ఎండీ

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీని సింగరేణి సీఅండ్ఎండీ ఎన్.బలరాం బుధవారం సందర్శించారు. అనంతరం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని జీఎం కార్యాలయంలో అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. గతేడాది బెల్లంపల్లి ఏరియాలో సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకతను జీఎండీ రవిప్రసాద్ వివరించారు. ఉత్పత్తి లక్ష్యసాధనలో అధికారులు, ప్రతి కార్మికుడి కృషి ఎంతో ఉందని సీఅండ్ఎండీ బలరాం అన్నారు. ప్రతి సంవత్సరం ఇలాగే బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తిలో ముందంజలో ఉంచడానికి ప్రతి కార్మికుడు కృషి చేయాలన్నారు. లక్ష్యాన్ని అధిగమించినందుకు సిబ్బందిని అభినందించారు. అనంతరం ఖైరిగూడ ఓసీ వెస్ట్ వ్యూ పాయింట్ పని స్థలాలను పరిశీలించారు. వట్టివాగు వంతెనల నిర్మాణంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖైరిగూడ ప్రాజెక్ట్ అధికారి ఎన్.సత్యనారాయణ, పీఓ ఉమాకాంత్, ఏజీఎం తిరుమలరావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ వీరన్న, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, సివిల్(ఎస్ఈ) భాషా, మేనేజర్ ప్రవీణ్ పాంటింగ్ పాల్గొన్నారు.



పిచ్చికుక్క దాడిలో చిన్నారికి గాయాలు



నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని ఇందిరిగాం గ్రామానికి చెందిన పావుడె సాయితేజ చిన్నారిపై బుధవారం పిచ్చికుక్కలు దాడిచేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో వీధి కుక్కలు ఒకేసారి బాలుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. దీనిని గమనించిన గ్రామస్తులు పిచ్చికుక్కలను తరిమివేసి బాలుడిని వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో సాయితేజను కాగజ్‌నగర్ వైద్యశాలకు కుటుంబీకులు తరలించారు.

నెలలో 10 మందిపై దాడి

పిచ్చికుక్కలు నెలరోజుల పరిధిలో 10 మందిపై దాడిచేశాయి. మండలంలో ఈ నెల ఆరో తేదీన పాపన్‌పేట గ్రామానికి చెందిన అగాడి సాంబయ్య, కుదురుపాక సూన, ఎల్లూరి పోశన్న, దందెర నాని, బట్టి బొందయ్య బట్టి లక్ష్మి, దందెర గంగుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. తాజాగా ఇందిరిగాం గ్రామానికి చెందిన సాయితేజపై పిచ్చికుక్కలు దాడిచేశాయి. పిచ్చికుక్కల బెడద నుండి కాపాడాలని మండలవాసులు కోరుతున్నారు. పిచ్చికుక్కల బెడద ఎక్కువైనప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడుతున్నారు. ఇలాంటి ఘటన మరోసారి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి




నవతెలంగాణ-సిర్పూర్(టి)

వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా, ఉపాధిహామీ కార్మికులకు పని ప్రదేశాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, దానికి తగినట్టుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ఇంటి పన్ను వసూలు చేయాలని, ప్రతి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచి దానికి అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో రోజూవారీ పారిశుద్ధ్యంపై తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ సమావేశంలో డీఎల్‌పీఓ సురేష్‌బాబు, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ కృష్ణమూర్తి, ఏపీఓ చంద్రయ్య కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రభంజనం



డి శ్రీజన్య 953 మార్కులు



అంకిత 430 మార్కులు



శిరీష 454 మార్కులు



శ్రీజ 964 మార్కులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర, బాలికల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రయివేటు కళాశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించినట్టు డీసీఓ పోలోజు బాలరాజు, ప్రిన్సిపాళ్ల సంగీత, కల్యాణి, సంధ్యారాణి తెలిపారు. బుధవారం విడుదల చేసిన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో బాలుర గురుకుల కళాశాలలో ఎంఈసీ ద్వితీయ సంవత్సరంలో వంద శాతం, మొదటి సంవత్సరంలో 90 శాతం ఫలితాలు, బాలికల గురుకుల కళాశాలలో ద్వితీయ సంవత్సరం వంద శాతం, ప్రథమ సంవత్సరంలో వంద శాతం, ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరంలో 91 శాతం, ద్వితీయ సంవత్సరంలో 59 శాతం ఉత్తీర్ణత సాధించారు. సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ద్వితీయ సంవత్సరంల ఎంపీసీలో డి.శ్రీజన్య 953, బైపీసీ ద్వితీయ సంవత్సరం జి.శ్రీజ 944, ఎంపీసీ ప్రథమ సంవత్సరం ఎం.శిరీష 454, బైపీసీ టి.అంకిత 430, బాలికల గురుకుల కళాశాలలో ఎంఈసీ ద్వితీయ సంవత్సరంలో బి.జీవన్ 925, జి.అభిషేక్ 904, మొదటి సంవత్సరం ఫలితాల్లో కె.రాజ్‌కుమార్ 898, రవికుమార్ 867, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం బైపీసీలో సీహెచ్ మనీశ 428, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ టి.మోహిత్ 952 మార్కులు సాధించారు. సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో హెచ్ఈసీ ద్వితీయ సంవత్సరంలో వంద శాతం, మొదటి సంవత్సరంలో 98 శాతం సాధించగా ద్వితీయ సంవత్సరం హెచ్ఈసీలో ఆర్.నిఖిత 934, పి.శైలజ 932, మొదటి సంవత్సరం సీఈసీలో ఆర్.స్మృతి 476, ఎం.మనీశ 472, ఎన్.అంజల్ 470, హెచ్ఈసీ మొదటి సంవత్సరంలో శ్రీనిధి 452, జి.స్నేహ 446 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు కళాశాలకు పేరు ప్రతిష్ఠలు నిలిపినందుకు ఇలాగే భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తు వారిని అభినందించారు.

వైద్య సిబ్బందికి తప్పని నీటి కష్టాలు

నవతెలంగాణ-నస్పూర్



మున్సిపాలిటీ పరిధిలోని అరుణక్కనగర్ పల్లె దవాఖానలో వైద్య సిబ్బందికి నీటి కష్టాలు తప్పడం లేదు. దీంతో నీటి కోసం రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పల్లె దవాఖాన ప్రతిరోజు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తూ ఉంటారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారికి సరైన సౌకర్యాలు లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది. గతంలో అధికారులు మిషన్ భగీరథ పైపులైను వేయించినప్పటికీ నీరు సరఫరా కావడం లేదని సిబ్బంది వాపోతున్నారు. నీటి ఇబ్బందులు ఉన్నాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లె దవాఖానాలో నీటి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

ఉరేసుకొని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్



ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఫెయిల్ అయినందుకు మనస్థాపంతో ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొరగారిపల్లెలో చోటు చేసుకుంది. సీసీసీ నస్పూర్ ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఇంటర్మీడియట్ చదువుతున్న గట్టిక తేజస్విని(18) బుధవారం వెలువడిన పరీక్షా ఫలితాల్లో గణితంలో రెండు ఫెయిల్ అయిందని మనస్థాపం చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం తేజస్విని మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కాసిపేట-2 గనిపై ఏఐటీయూసీ గేట్ మీటింగ్

- సమస్యలపై వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియా కాసిపేట 2వ గనిపై బుధవారం ఏఐటియుసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కాసిపేట 2 గని మేనేజర్ లక్ష్మీ నారాయణకు అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్ ఆలీ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్ మాట్లాడుతూ సింగరేణి ఎన్నికలలో కార్మికులు గుర్తింపు సంఘంగా గెలిచి మూడు నెలలు కావాల్సి వస్తున్న గుర్తింపు పత్రం రావడం ఆలస్యం అయితున్నందు వల్ల సింగరేణిలో సంస్థలు కార్మికుల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉండిపోయాయని అన్నారు. గనిలో నూతన సైకిల్ షెడ్ నిర్మించాలని, కార్మికులకు అన్ని వసతులతో కూడిన రూములు నిర్మించాలని, ప్రతి కార్మికునికి లాకర్ బాక్స్ ఇవ్వాలి, కాసిపేట-2వ గనిపై కొలిమి దగ్గర, వెల్డింగ్ చేసే పని ప్రదేశంలో పర్మినెంట్ షెడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. మ్యాన్ రైడింగ్ తొందరగా ఏర్పాటు చేయాలని, ఎలక్ట్రీషన్, ఫిట్టర్, టెక్నీషియన్లకు నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలని, ఫ్యాన్ ఆపరేటర్లకు ఉండేందుకు రూము నిర్మించాలని అన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, కొండపల్లి నర్సయ్య, బొద్దుల వెంకటేష్, సుభాష్ చంద్రబోస్, మొయినుద్దీన్, కేతన్, జావిద్, దేవులపల్లి శ్రీనివాస్, అరుణ్ కుమార్, అంజద్ ఖాన్, రత్నం రాయలింగు, కార్మికులు పాల్గొన్నారు.

అర్హులైన పీఈటీల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-మందమర్రి

వేసవి శిక్షణకు అర్హులైన పీఈటీల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరం సింగరేణి ఉద్యోగుల పిల్లలకు వేసవిలో అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, వాలీబాల్, ఫుట్ బాల్‌లో నైపుణ్యం గల శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన పీఈటీలను మందమర్రి, సోమగూడెం, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్‌ల వారు ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆయా క్రీడల్లో అనుభవం కలిగిన పీఈటీలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం కలిగిన క్రీడాకారులు శిక్షణ ఇచ్చేందుకు అర్హులని పేర్కొన్నారు. 25 రోజుల శిక్షణకు గౌరవ వేతనం అందిస్తామని తెలిపారు.

నేటి నుంచి ఏసు పునరుత్థాన మహా జాతర

- లక్సెట్టిపేట సీఎస్ఐ చర్చి ముస్తాబు



నవతెలంగాణ-లక్సెట్టిపేట

దక్షిణ భారతదేశంలోనే మెదక్ చర్చ్ తర్వాత రెండో అతిపెద్ద చర్చిగా లక్సెటిపేట పట్టణంలోని సీఎస్ఐ చర్చి ప్రాముఖ్యత కల్గింది. విశ్వ మానవాళికి, ప్రేమ, శాంతి సందేశం, బోధించిన ఏసుక్రీస్తు పునరుత్థాన ప్రాంతీయ మహా జాతరను ప్రతీ సంవత్సరం నిర్వహిస్తారు. ఈ ఏడాది ఏప్రిల్ 25, 26వ తేదిల్లో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చర్చిని విద్యుత్ కాంతులతో అందంగా ముస్తాబు చేశారు. ఈ జాతరకు లక్సెటిపేట మండలం, పట్టణ ప్రజలతోపాటు, ఉమ్మడి అదిలాబాద్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ, వివిధ రాష్ట్రాల నుండి కూడా భక్తులు హాజరవుతారు. గత 70 ఏండ్లుగా ప్రతి ఏట రెండు క్వింటాళ్ల ప్రసాదం వండి పంచిపెడతారు. చక్కెర, కొబ్బెరి కుడుకలు, నువ్వులు మొదలగు వాటితో ప్రసాదం తయారు చేస్తారు.

సింగరేణి ఉద్యోగి కుమార్తెకు ఇంటర్‌లో స్టేట్ ర్యాంక్

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియా ఐటీ విభాగ హెచ్ఓడీ జి శ్రీనివాస్ (సీనియర్ ప్రోగ్రామర్ ఐటి) ప్రథమ పుత్రిక గోల్లాల సంయుక్త ఇటీవల నిర్వహించిన ఇంటర్మీడియట్ ఎంఈసీ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో 1000 మార్కులకు గాను 988 మార్కులతో తెలంగాణ రాష్ట్ర మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి సంయుక్తను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించడం, అలాగే వారు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం చాలా అభినందించదగిన విషయమని తెలిపారు. ఈ సందర్భంగా డీజీఎం(ప) పి అరవింద రావు, ఇతర అధికారులు సంయుక్తను అభినందించారు.

మోడల్ ఇంటర్ కళాశాల ఫలితాలు

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్ ఫలితాలను ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య వివరించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 92 శాతం, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 54 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



మత్తు పదార్థాలు, మద్య పానీయాల వినియోగం యువత భవిష్యత్తుకు నిరోధకమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డీసీపీ అశోక్ కుమార్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు వి.రాములు, హరికృష్ణ, ఆబ్కారీ, మద్యపాన నిషేధ శాఖ పర్యవేక్షకులు నందగోపాల్ మత్తు పదార్థాల నియంత్రణపై తీసుకోవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మద్యానికి, మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, జిల్లాలో నిషేధించబడిన మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై గట్టి నిఘా ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని, జిల్లాలో గంజాయి సాగు జరుగకుండా వ్యవసాయ, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని తెలిపారు. పోలీసు శాఖ అధికారులు మాదక ద్రవ్యాలు, గంజాయి అక్రమ రవాణా జరుగకుండా జిల్లాలో తనిఖీలు చేపట్టాలని, పోలీసు, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ పట్టణాలలో గంజాయి సరఫరాపై నిఘా నిర్వహించాలని, అటవీ ప్రాంతంలో గంజాయి సాగు జరుగకుండా దృష్టి సారించాలని తెలిపారు. ఆబ్కారీ, మద్యనిషేధ శాఖ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందికి తగు శిక్షణ ఇచ్చి తనిఖీలు చేపట్టాలని, రైల్వే రక్షణ దళం అధికారుల సమన్వయంతో రైళ్లలో సరఫరా జరుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీ ఏర్పాటు చేసి సెప్టెంబర్-2023 నుండి ప్రతి నెల ఆఖరి పని రోజున ప్రభుత్వ కళాశాలలతో పాటు ప్రయివేట్ కళాశాలల్లో మాదక ద్రవ్యాలు, గంజాయి వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పట్వర్ధన్, సెంట్రల్ జీఎస్టీ పర్యవేక్షకులు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా చేనేని భీమయ్య వర్ధంతి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మద్దిమాడ గ్రామంలో చేనేని భీమయ్య 36వ వర్ధంతిని ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ గిరిజనుల సాంప్రదాయ పద్ధతిలో ర్యాలీగా వచ్చి ప్రత్యేక పూజలు చేసి చేనేని భీమయ్య విగ్రహం వద్ద ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజనులు, ఆదివాసీ నేతలు ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మాట్లాడారు. ఇళ్ల నిర్మించుకునేందుకు కర్ర కోసం అడవికి వెళ్లి తెచ్చుకుంటుండగా అమానుషంగా కాల్పులు జరిపి చేనేని భీమయ్యను పొట్టన పెట్టుకున్నారన్నారు. శరీరంలో తూటా దిగినా గిరిజన ప్రతిమ చూపి వీర మరణం పొందిన చేనేని భీమయ్యను ఆదివాసీలు స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చేనేని భీమయ్య వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లిలో చేసిన ప్రకటన విధంగా అమరులైన కుటుంబాలను, గాయాలైన కుటుంబాలను ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, మాజీ సర్పంచ్లు రొడ్డ రమేశ్, ఆడె జంగు, నాయకపోడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, జాయింట్ సెక్రెటరీ తట్ల భీంరావ్, ఉపాధ్యాక్షుడు గంది రాజన్న, జిల్లా అధ్యక్షుడు పెద్ది భార్గవ్, మండల అధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మేంద్రపు రాజన్న, ఉపాధ్యాక్షుడు భీమిని మహేందర్, కార్యదర్శి మంగ శ్రీకాంత్, రెడ్డి లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్య సమాజంలో ఎలా ఉండాలో నేర్పుతుంది

- వయోజన విద్యాశాఖ వరంగల్ డీడీ బాబురావు

నవతెలంగాణ-మందమర్రి



విద్య అభ్యసించడంతో సమాజంలో ఎలా బతకాలో నేర్పిస్తుందని వయోజన విద్యా శాఖ వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ ఏ బాబురావు అన్నారు. స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం శ్రీపతి నగర్‌లోని వయోజనవిద్య, కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యాసకులు, శిక్షకులతో ముచ్చటించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు మాత్రమే కుటుంబాన్ని సమాజాన్ని తీర్చిదిద్దగలరని పేర్కొన్నారు. చదువుకునేందుకు వయసు అడ్డం కాదని మహిళలు విద్యను మధ్యలో అపవద్దని ఓపెన్ డిగ్రీ, ఇంటర్ చదువుకునేందుకు ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వయోజన విద్యా కార్యక్రమాల్లో మంచిర్యాల జిల్లా ముందుండాలని ఆకాంక్షించారు. హార్టి కల్చర్, సెరి కల్చర్ జిల్లా అధికారి వి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ విద్య వల్లనే మనిషికి సమాజంలో గౌరవం పెరుగుతుందని అన్నారు. పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి జిల్లా స్థాయి అధికారిగా ఎదిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, విద్యా శాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ ఏ సత్యనారాయణ మూర్తి, డీఆర్‌పీలు పోకల వెంకటేశ్వర్లు, అశోక్ రావు, బండ శాంకరీ, శిక్షణ కేంద్రం కో ఆర్డినేటర్ ఉప్పులేటి గోపిక, శిక్షణ కేంద్రం సూపర్ వైజర్ ఉప్పులేటి నరేష్, రామసాని శేఖర్, శిక్షణ కేంద్రం ట్రైనర్ ఉప్పులేటి శారద పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వారితో స్నేహపూర్వకంగా మెదలాలని అదనపు కలెక్టర్ బి రాహుల్ అన్నారు. బుధవారం జిల్లాలోని మాతాశిశు ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, రిసెప్షన్, ఆస్పత్రి పరిసరాలను డీఎంహెచ్ఓ డా జిసి సుబ్బారాయుడు, ఆర్ఎంఓ. భీష్మతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, రోగులతో స్నేహ పూర్వకంగా మెదలాలని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భం దాల్చిన మహిళలు తమ వివరాలు నమోదు చేసుకొని సమయానుసారంగా అవసరమైన పరీక్షలు చేసుకొని, పౌష్టికాహారం తీసుకునేలా ఆశ, ఆరోగ్య కార్యకర్తల ద్వారా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వేసవికాలం అయినందున వడదెబ్బకు గురై ఆస్పత్రికి వచ్చే వారికి అవసరమైన వైద్య చికిత్సలు అందించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ఆసుపత్రిలో తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని, ఆస్పత్రికి సంబంధించిన ప్రతి రికార్డు, ప్రతి రిజిస్టర్‌ను ఖచ్చితంగా నిర్వహించాలని తెలిపారు.

వైద్య సేవల కోసం కార్డ్ రెన్యువల్ చేసుకోవాలి

నస్పూర్ : సింగరేణిలో సీపీఆర్ఎంఎస్ మెడికల్ హెల్త్ కార్డును రెన్యువల్ చేసుకుని వైద్య సేవలు పొందాలని డీజీఎం పర్సనల్ అరవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో పనిచేసి రిటైర్ అయ్యి సీపీఆర్ఎంఎస్-ఎస్ఈ (నాన్ ఎగ్జిక్యూటివ్) మెడికల్ కార్డు కలిగి ఉన్న మాజీ ఉద్యోగులు వారి భార్యలు సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డును రెన్యువల్ చేసుకోవాలని పేర్కొన్నారు. రెన్యువల్ కొరకు ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో లైఫ్ సర్టిఫికేట్ సమర్పించడం జరుగుతుందని, కానీ శ్రీరాంపూర్ ఏరియాలో దాదాపు 973 మంది మాజీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల భార్యలు గత నవంబర్ నెల నుండి ఇప్పటి వరకు వారి మెడికల్ కార్డు రెన్యువల్‌కు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించలేదని తెలిపారు. కార్డు రెన్యువల్ చేసుకోక పోవడం వల్ల అత్యవసర పరిస్థితులలో వారి మెడికల్ కార్డు రెన్యువల్ కాని కారణంగా వైద్య సౌకర్యం సకాలంలో అందక ఇబ్బందులకు గురి కావలసి వస్తుందన్నారు. ఇప్పటి వరకు మెడికల్ కార్డు రెన్యువల్ కొరకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించని మాజీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల భార్యలు ఆన్‌లైన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించి వారి మెడికల్ కార్డును రెన్యువల్ చేసుకుని వైద్య సేవలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని కోరారు.

108 వాహనంలో ప్రసవం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రోటి గూడ గ్రామానికి చెందిన ఎస్.శోభ పురిటి నొప్పులతో బాధపడడంతో వెంటనే వారి కుటుంబ సభ్యులు జన్నారం ప్రభుత్వ ఆస్పత్రికి తరళించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆమెను 108 వాహనంలో తీసుకెళు ండగానే మార్గమధ్యంలో శోభకు నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటి కిషన్ ఆశా వర్కర్ల సహాయంతో పురుడు పోయగా మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి బిడ్డలను లక్సెట్టిపేట ఆస్పత్రిలో చేర్పించారు. తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. 108 సిబ్బందికి శోభా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా





నవతెలంగాణ-లక్సెట్టిపేట

పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఈ సందర్భంగా వారికి పలువురు అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన మొదటి సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో లక్సెటిపేట మున్సిపాలిటీ ఇటిక్యాలకు చెందిన పెసరుగీతా ప్రసాద్-సంధ్యారాణిల కూతురు మిహిత ఇంటర్ బైపీసీలో 440కి 437 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రాణించింది. ర్యాంకు సాధించిన మిహితను తల్లిదండ్రులు, పలువురు, అభినందించారు. అదేవిధంగా లక్సెటిపేట పట్టణ కేంద్రానికి చెందిన కందుల ఖుషిఇంద్ర వర్మ సైతం బైపీసీలో 440కి 436 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించారు.

కొత్త మెషిన్లు ఏర్పాటు చేసి ప్లే డేలు ఇవ్వాలి



నవతెలంగాణ-మందమర్రి

కొత్త మెషిన్లు ఏర్పాటు చేసి ప్లేడేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు కోరారు. బుధవారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకట స్వామి, పిట్ సెక్రటరీ భేతి భరత్ ఆధ్వర్యంలో ఏరియా వర్క్ షాప్ సమస్యలపై ఇంజనీర్ కృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. వర్క్ షాప్‌లోని పాత మిషన్ల స్థానంలో కొత్త మిషన్లను ఏర్పాటు చేయాలని, నాణ్యమైన కొత్త టూల్స్‌ను అన్ని సెక్షన్‌లకు ఇవ్వాలని, ఆఫీసులో పనిచేస్తున్న సిబ్బందికి కొత్త కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. టీఐఎస్ఓజీలు తయారు చేస్తున్న వారికి ఇన్సెంటివ్‌కు అర్హత కల్పించాలని, కోవిడ్‌కు ముందు ఇచ్చిన విధంగానే అన్ని సెక్షన్‌లకు ప్లే డేలు కల్పించాలని, ఏరియాలో వర్క్ షాప్‌లో ఖాళీగా ఉన్న మౌల్డర్ బ్లాక్ స్మిత్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వాహనాలను సర్వీసింగ్ చేసే ఆటో గ్యారేజ్ సెక్షన్లో సర్వీసింగ్ ప్లాట్ ఫాంను ఏర్పాటు చేయాలని డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జె సంతోష్, అన్వేష్, మధు, సదానందం, శ్రీనివాస్, ప్రమోద్, జహీద్ అలీ, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

ఉత్కూర్ చౌరస్తాలో తాత్కాలిక షెడ్డు నిర్మించాలి

నవతెలంగాణ-లక్సెట్టిపేట



పట్టణంలోని ఉత్కూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం తాత్కాలిక షెడ్డు నిర్మించాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు డిమాండ్ చేశారు. బుధవారం అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వివిధ పనుల రీత్యా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు ఎండలో ప్రయాణాలు సాగిస్తారని, వారికి మానవత్వంతో అలోచించి షెడ్డు నిర్మించాలన్నారు. ఎండ దెబ్బ తగలకుండా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పట్టణం పెరుగుతుందని కానీ ఇంతవరకు పర్మినెంట్ షెడ్డు నిర్మించక పోవడం శోచనీయమన్నారు. ఇంకా ఎన్టీఆర్ చౌక్ (కరీంనగర్ చౌరస్తా)లో కూడా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆర్టీసీ, మున్సిపల్ ఆధ్వర్యంలో సంయుక్తంగా తగు చర్యలు చేపడితే బాగుంటుందన్నారు. అంబేద్కరిస్టులు నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతామని తెలిపారు. సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ 24 గంటల్లో తగు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బైరం లింగన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, తొగరు ఏసన్న, మహేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇంటర్ బైపీసీలో స్టేట్ ర్యాంక్

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన రాథోడ్ వినోద్ సవిత దంపతుల కుమార్తె రాథోడ్ స్నేహలత ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకును సాధించింది. బుధవారం విడుదలైన ఫలితాల్లో బైపీసీ విభాగంలో నిర్మల్ ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థిని రాథోడ్ స్నేహలత స్టేట్ 1వ ర్యాంకును సాధించింది. ఈ సందర్భంగా ఇంటర్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంకును సాధించిన విద్యార్థిని కళాశాల యజమాన్యం, అధ్యాపకులు, మండల ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

అత్యాచార కేసులో నిందితుడికి జైలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అత్యాచార కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు, రూ.ఐదు వేలు జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ తీర్పు ఇచ్చారు. ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫాబాద్ జిల్లా బాబాపూర్ గ్రామానికి చెందిన చంద్రి దామోదర్ కుమార్తె మౌనిక స్థానిక ప్రయివేట్ కళాశాలలో చదువుతుండగా తుంపెల్లి గ్రామానికి చెందిన పోలవేణి సాయి 2019 ఫిబ్రవరి 2న మాయ మాటలు చెప్పి మభ్యపెట్టి కిడ్నాప్ చేసి శారీరకంగా లోబరుచుకున్నాడు. అంతకుముందు కూడా మౌనికను వివాహం చేసుకుంటానని చెప్పి ఆమెను అనేకసార్లు శారీరకంగా లోపరుచుకున్నాడు. మౌనిక తండ్రి చంద్రి దామోదర్‌ని కులం పేరుతో దూషించాడని తెలిపారు. తండ్రి దామోదర్ ఫిర్యాదు మేరకు అప్పుడు కేసు నమోదు చేయగా సాక్షులను విచారించి నేరం చేసినట్టు రుజువు కావడంతో నిందితుడు పొలవేణి సాయికి 20 సంవత్సరాల జైలుతో పాటు రూ.5000 చొప్పున జరిమాన విధిస్తూ జిల్లా జడ్జి తీర్పు ఇచ్చారని తెలిపారు. నిందితుడినికి శిక్ష పడేలా చేసిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు.

ఆంక్షాలు లేకుండా కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-బోథ్

జొన్న పంటలను ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వం కొనుగోళ్ల చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగేపు బోర్రన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న జొన్న కొనుగోళ్ల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్ల జొన్న పంట ఎకరాకి దాదాపుగా 20 నుండి 25 క్వింటాల్ వరకు పంట దిగుబడి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 8 క్వింటాళ్ల 85 కిలోలు కొనుగోలు చేస్తామని ప్రకటించిందన్నారు. జిల్లాలో తెల్ల జొన్న పంట గతంలో 38 వేల ఎకరాలలో సాగుచేస్తే ఈ ఏడాదిలో 62 వేల ఎకరాలలో సాగు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర రూ.3,180 ఉండటంతో రైతులు తెల్ల జొన్న పంటపై ఆసక్తి చూపారన్నారు. ఎలాంటి ఆంక్షాలు లేకుండా జొన్నలను కొనుగోళ్ల చేయాలని, లేని పక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట కిసాన్ మిత్ర ఫీల్డ్ కో ఆర్డినేటర్ షారుఖ్, రైతులు రామకృష్ణ, భూమారెడ్డి, భూమన్న, ముస్తఫా ఉన్నారు.

మండలంలో పోలీసుల కవాతు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రుద్రపూర్ గ్రామాల్లో సీఐ సాదిక్ పాషా, ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలతో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన రహదారి వెంట పోలీసు అధికారులు, సిబ్బంది, సాయుధ పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవడం కోసం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. భయభ్రాంతులు, ప్రలోభాలకు గురికావద్దన్నారు. కుల, మత, పేద, ధనిక అనే తేడా లేకుండా ఓటు హక్కు అందరికీ సమానమని చెప్పారు. దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మౌల్కర్ సతీష్ కిరణ షాప్‌ను తనిఖీ చేసి 5.25లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-రెబ్బెన

ఇంటర్మీడియేట్ పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రంలోని సాంఘీక గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత సాధించి ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో వంద శాతం, మొదటి సంవత్సరంలో 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో కె.ఆశ్మిత, ఎం.అహన్య 1000 మార్కులకు గాను 957 మార్కులు సాధించి మండల టాపర్‌లుగా నిలిచారు. జి.శివాని 944, ఎం.పావని 929, బైపీసీలో తోటపల్లి వైష్ణవి 968 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ఎం సమత 959, జే స్వామి 956 మార్కులు సాధించారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో సాలిగామ హారిక 470 మార్కులకు గాను 461 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ఎం నందిని 435, దుర్గం పావని429, బైపీసీలో జాడి జయరాణి 440కు గాను 430 సాధించి టాపర్‌గా నిలిచింది. పి.మహిత 421, ఎస్ దీక్షిత 417 మార్కులు సాధించారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ చైతన్య, కళాశాల సిబ్బంది అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రాలతో మానసిక,శారీరక ఎదుగుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పిల్లల్లో మానసిక శారీరక ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో తోడ్పడతాయని జిల్లా డీడబ్ల్యూఓ భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని నవేగం, రాంపూర్ గ్రామపంచాయతీలలో నిర్వహించిన పూర్వ ప్రాథమిక విద్య దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలను మానసిక, శారీరక అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పూర్వ ప్రాథమిక విద్య ఎంతో ప్రాధాన్యమైనదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యతో పాటు పిల్లలకి కావాల్సిన పోషకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతినెల కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ సీడీపీఓ సాదియా రుక్సానా, సూపర్‌వైజర్ కళావతి, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, సెక్రెటరీ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం కేసు నమోదు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రానికి చెందిన అదృశ్యమైన కేసును నమోదు చేసినట్టు ఎస్సై నరేష్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆటకపురం లక్ష్మి ఈనెల 16 నుంచి కనిపించపోయిందన్నారు. బంధువుల ఇండ్లలో వెతికిన ఆచూకి లభించలేదన్నారు. లక్ష్మీ భర్త నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

- రాష్ట్ర, కళాశాల స్థాయిలో ఉత్తమ ఫలితాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలో ఉన్న ఆయా కళాశాల నుండి పలువురు విద్యార్థులు మంచి ప్రతిభను కనబర్చారు. పలువురు రాష్ట్ర, జిల్లా, కళాశాల స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారు.

విద్యార్థి కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఇందులో భాగంగా పట్టణంలో ఉన్న విద్యార్థి కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. ఎంపీసీ రెండవ సంవత్సరంలో ఆకాశ్ 1000కి గాను 963, రాథోడ్ రవిత 953, బైపీసీలో ఐశ్వర్య 953, సిడం ఇలైజ 952, ఎండీ పుర్జన్ 943, శ్రేయ 931, శ్రీకుమార్ 921, రాథోడ్ మమత 921, ఎంఈసీలో బద్దపురం నిహల్ బాబు 934, సీఈసీలో ఆస్పియ బాను 917 మార్కులు సాధించారు. అదే మొదటి సంవత్సరంలో ఎంపీసీలో 470కి కనుకుంట్ల స్పందన 454, అడేపు మౌనక 448, సర్పే విశాల్ 447, జితేశ్వర్ శైలజ 247, అప్పల శ్రావణ్ కుమార్ 424, కపుర్కర్ అతర్వ 423, ఎంఈసీలో శ్రీరాముల నేహ 447, బైపీసీలో పర్స వైష్ణవి 429, సీఈసీలో అఖిలేష్ 427 విద్యార్థులు మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో కళాశాల యజమన్యం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్తులకు పుష్పగుచ్చాలు అందించి సత్కరించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు పుష్పగుచ్చాలు అందించి అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రావణ్ కుమార్, సిబ్బంది లక్ష్మారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

పట్టణంలోని ఎస్.ఆర్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మంచి ప్రతిభను కనబరిచారు. ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో మర్శెట్టి హరిణి 988 మార్కులు, సుక్ బీర్ కౌర్ 987, గోక సాత్విక 986 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో క్యాతం బిందు 988, పాల శ్రీనిజ 983, రాథోడ్ దివ్య 982 మార్కులు సాధించారు. 15 మంది విద్యార్థులు 980 మార్కులకు పైగా సాధించినట్లు కళాశాల ప్రతినిధులు తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీ విభాగంలో అదితి దేశ్పాండే 467, మేఘన జాదవ్ 466, గడ్డం కీర్తి 465, సడలి ప్రణయ్ 465, కనపర్తి వీణ 465, కొటోజు పద్మావతి 465, బైపీసీ విభాగంలో దివ్య వైలె 436, అంజెల్ కలమడుగు 436, లోక హరిణి 436, సంజన పెర్క 435, శిరీష డోంగ్రే 435, స్నేహ జాదవ్ 435 మార్కులు సాధించారు. వీరిని కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఎస్ఆర్ కళాశాల చైర్మన్ వరద రెడ్డి, డైరెక్టర్స్ సంతోష్ రెడ్డి, మధుకర్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్స్ బ్రహ్మం, జైపాల్ రెడ్డి, అరవింద్ విద్యార్థులను సత్కరించారు.

రిసోనెన్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

పట్టణంలోని రిసోనెన్స్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. నిహారిక దుర్గా ఎంపీసీ విభాగంలో 470 మార్కులు 466 మార్కులు సాధించింది. అమితి ఎంపీసీ విభాగంలో 466 మార్కులు సాధించింది. బైపీసీ విభాగంలో సలహా విద్యార్థిని 440 మార్కులకు గాను 434 వరకు సాధించింది. దీంతో బుధవారం కళాశాలలో అకాడమీ యజమాన్యం విద్యార్థులకు పుష్ప గుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ ప్రమోద్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

470కి గాను 463 మార్కులు

ఆదిలాబాద్ పట్టణంలోని చిలుకూరి లక్ష్మీ నగర్‌కు చెందిన విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. అల్లాపూర్ సతీష్, నీరజ దంపతుల కుమార్తె తనీషా ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకుగాను 463 మార్కులతో సత్తా చాటింది. ఉత్తమ మార్కులతో ఏ గ్రేడ్ సాధించింది. ఉత్తీర్ణురాలైన విద్యార్థి తనీషాను కుటుంబ సభ్యులు, కాలనీవాసులతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

440 మార్కులకు 432

జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థిని సత్తా చాటింది. స్థానిక ఎంప్లాయిస్ కాలనీకి చెందిన తమ్మల-గంగన్న దివ్యల కూతురు తమ్మల శ్లోక బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను 432 మార్కులు సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించిన శ్లోకను తల్లిదండ్రులు పలువురు అభినంధించారు.

470 మార్కులకు 464

ఆదిలాబాద్‌కు చెందిన సడల ప్రణయ్ రాష్ట్రస్థాయిలో సత్తా చాటాడు. జైనథ్ మండలం గిమ్మ గ్రామానికి సడల బాపన్న-గంగమ్మ దంపతుల కుమారుడు ప్రణయ్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470మార్కులకు గాను 465 మార్కులు సాధించి ఔరా అనిపించాడు. దీంతో సదరు విద్యార్థిని గ్రామస్తులు, అధ్యాపకులు అభినందించారు.

కళాశాల స్థాయిలో టాపర్‌గా సౌమ్య

పట్టణంలోని బంగారిగూడా మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎంపీసీ విభాగంలో టాపర్‌గా నిలిచింది. జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న సోము లక్ష్మారెడ్డి, సోము రోహిణి దంపతుల కుమార్తె సోము సౌమ్య కళాశాల స్థాయిలో సత్తా చాటింది. ఎంపీసీ విభాగంలో 1000మార్కులకు గాను 919 మార్కులు సాధించి ఔరా అనిపించింది. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు ఆమెను అభినందించారు.



రిసోనెన్స్ కళాశాలలో విద్యార్థులను సత్కరిస్తున్న యాజమాన్యం



విజయ కేతనం చూపుతున్న విద్యార్థి కళాశాల విద్యార్థులు

ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

లోక్‌సభ ఎన్నికలలో భాగంగా మే 13న జరగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లుతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. బుధవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున పూర్తిస్థాయిలో ఓటింగ్ జరిగేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పోలింగ్ కేంద్రాలలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నిర్వహణ జిల్లాలో ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియతో పాటు పోలింగ్ కొరకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లలో పోలింగ్ నిర్వహణకు పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈనెల 25 నుండి ఓటరు స్లిప్పుల పంపిణీకి కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మధుకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలి

- అదనపు కలెక్టర్ బి.రాహుల్



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బుధవారం నస్పూర్ మండలం సీతారాంపల్లిలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల మేరకు నాణ్యమైన వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేసి వరిధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించాలని, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం నీడ, తాగునీరు సౌకర్యాలతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గన్నీ సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర పొందేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

తప్పిన ఆస్తి నష్టం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతలపల్లి సమీపంలోని ఇప్పలపల్లి గ్రామంలో పెంకర్ల రాజయ్య, చల్ల గంగాధర్‌ల మక్క పెరడుకు నిప్పు అంటుకుంది. అక్కడ ఉన్న శివ అనే వ్యక్తి 100కు ఫోన్ చేయగా విదుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్ అప్రమత్తమై ఫైర్ సిబ్బందితో వెళ్లి మంటలు ఆర్పారు. మొత్తం 3.5 ఎకరాలలో రూ.2 లక్షల పంట ఉండగా రూ.60000ల పంట నష్టం వాటిల్లింది. సమయానికి ఫైర్ సిబ్బంది వెళ్లి మంటలు ఆర్పడంతో పంట నష్టం తప్పింది. దీంతో కానిస్టేబుల్ శ్రీనివాసును, ఫైర్ సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఎస్ఎఫ్ఓ పి.లక్ష్మీనారాయణ, ఎల్ఎఫ్ బి సతీష్ రెడ్డి, డీపీఓ చంద్రయ్య, ఎఫ్ఎంలు జి. ప్రవీణ్ కుమార్, టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయ పున:నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-జన్నారం

మండలం చింతగూడ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునఃనిర్మాణం కోసం, రూ.51,116 చెక్కును బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బాదావత్ పూర్ణచందర్ నాయక్ ఆలయ కమిటి, గ్రామ పెద్దలకు అందజేశారు. బుధవారం పూర్ణచందర్ నాయక్ ఆలయంలో ప్రత్యేక పూజలుచేసిన అనంతరం హనుమాన్ దీక్ష పరులతో పాటు గ్రామ పెద్దలు ఆలయ పునఃనిర్మాణం కోసం సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పొడేటి నరేష్ గౌడ్, పురంశెట్టి సతీష్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్‌కుమార్, చంద్రమోహన్, పూర్ణన్న ఉన్నారు.



సీఎం రేవంత్ ప్రసంగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల కాంగ్రెస్ బహిరంగ సభలో ఈసీ నిబంధనలు పాటించకుండా సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం చేశారని, ఆయనపై ఎన్నికల కమీషన్ తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజ్జగిరి నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షి షాకు పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. నిబంధనలు ఉల్లంగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జగదీష్, సతీష్, ఆసీఫ్, కలీం, సోహెబ్ పాల్గొన్నారు.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణక్కకు మద్దతుగా కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. బుధవారం ఉదయం మార్నింగ్ వాక్‌లో భాగంగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో వాకర్స్‌ను కలిసి పార్టీ మేనిఫెస్టో అంశాలు, రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులు వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రాముని చెరువును కబ్జాల నుండి కాపాడండి



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలో గల రాముని చెరువులో భూమిని కబ్జా చేయాలని కొందరు ఆక్రమణదారులు ప్రయత్నిస్తున్నారని పౌర సంఘాల నాయకులు ఆరోపించారు. బుధవారం మంచిర్యాల నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం రాముకు వినతి పత్రం అందించారు. హైటెక్ సిటీ ప్రాంతంలో కొందరు అక్రమంగా చెరువు మధ్యలో నుంచి రోడ్డు వేసి, వారి మురుగు నీటిని రాముని చెరువులోకి వదులుతున్నారని, జాఫర్ నగర్ వైపు గతంలో నిర్మించిన గోడకు కొందరు రంధ్రం చేసి మురుగునీటిని చెరువులోకి వదులుతున్నారన్నారు. గతంలో చెరువుని రెండు ముక్కలు చేస్తూ మధ్యలో నిర్మించిన కట్ట కారణంగా చెరువ భూమి ఆక్రమణలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. 2019లో నాటి కలెక్టర్ కర్ణన్ ఆధ్వర్యంలో వేసిన సరిహద్దు రాళ్లను కొందరు తొలగించి మరీ ఆక్రమణలకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై విచారణ చేసి చెరువు సంరక్షణకు, కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, జన్మభూమి నగర్ వాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనుకుంట్ల మల్లయ్య, కార్యదర్శి తిరుపతి సభ్యులు శ్రీరామోజు కొండయ్య, కామిల్ల జయరాజు, కైలాసం, మహమ్మద్ రవూఫ్, గుంటి ప్రభాకర్, రంగు రాజేశం, అసిస్టెంట్ ఇంజనీర్ గౌతమ్ పాల్గొన్నారు

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ




నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని పిహెచ్‌సీని జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడ దెబ్బ తగిలిన వారికి ఇవ్వాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీకి సరిపడా మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు.

108 అంబులెన్స్ సిబ్బందికి రాష్ట్ర స్థాయి అవార్డు

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట 108 అంబులెన్స్ ఈఎన్టీ ఆత్మారావు, పైలెట్ రాజిరెడ్డికి రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. 108లో ఉత్తమ సేవలకు గాను గుర్తించి అవార్డు అందించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 108 ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ జీవికే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో కాసిపేట 108 ఈఎన్టీ ఆత్మారావు, పైలెట్ రాజిరెడ్డికి 108 స్టేట్ లెవెల్ సేవియర్ అవార్డు అందించారు. సంస్థ సీఈఓ ఎంఎ అలీద్, డైరెక్టర్ వెంకటేశం, మేనేజర్ సామాట్ చేతుల మీదుగా అవార్డులను స్వీకరించారు.



ఊపందుకున్న నామినేషన్ల పర్వం

- 7వ రోజు 12నామినేషన్లు
- బీజేపీ రెబల్‌గా రాథోడ్ రమేష్ నామినేషన్
- నేడే చివరి తేదీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పర్వం ఊపందుకుంది. బుధవారం ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి భారీగా నామినేషన్‌లు దాఖలయ్యాయి. గురువారంతో నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ ముగియనుంది. ఏడవ రోజు ఒక్కరోజే 12 నామినేషన్లు దాఖలు అయినట్లు జిల్లా రిటర్నింగ్ అధికారి రాజర్షి షా తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు తరపున ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, బీఆర్‌ఎస్ నాయకులు సాజిదొద్దీన్, డాక్టర్ కిరణ్ కుమార్, పురుషోత్తం యాదవ్, దుర్వ నగేస్ కలిసి మూడవ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నాలుగవ సెట్‌ను బీఆర్‌ఎస్ ముధోల్ ఇన్‌చార్జి రమాదేవి, తుడుందెబ్బ గౌరవ అధ్యక్షులు బుర్స పోచయ్య, కొలాం సంఘం జిల్లా అధ్యక్షులు కోడప సోనేరావు, ఆంద్ సంఘం ఉపాధ్యక్షులు సర్కే దత్తు, పోతింక్ శంకర్ కలిసి వేశారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్, పాల్వాయి హరీష్ బాబుతో కలిసి మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. రెండు, మూడు, నాలుగవ సెట్‌లు పలువురు నాయకులు కలిసి వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ మూడవ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ నుండి రాథోడ్ రమేష్ నామినేషన్ వేశారు. గోండ్వాన దండకారణ్య పార్టీ నుండి కొడప వామన్‌రావు, ఇండిపెండెంట్ రాథోడ్ సుభాష్ తరపున చాటే వినోద్ నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్‌గా నేతావత్ రాందాస్, కొమురం ముత్తయ్య నామినేషన్ వేశారు.



బీజేపీ రెబల్‌గా రాథోడ్ రమేష్ నామినేషన్

బీజేపీ రెబల్ అభ్యర్థిగా రాథోడ్ రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. సోలోగా వచ్చి నామినేషన్ వేయడం చర్చనీయాంశమైంది. బీజేపీ అభ్యర్థిగా గోడం నగేష్ బుధవారం నామినేషన్ దాఖలు చేయగా ఆయనకు మద్దతుగా కాకుండా స్వతంత్రంగా ఆర్‌ఓ కార్యాలయానికి వెళ్లి ఒక్కరే నామినేషన్ వేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అటు ఎంపీ సోయం బాపురావ్ సైతం బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ నామినేషన్‌కు గైర్హాజరవ్వడం చర్చనీయాంశంగా మారింది.

అదుపుతప్పి కెమికల్ లారీ బోల్తా



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

పెద్దవాగు ప్రధానరహదారి మధ్యలోని బొక్కెనవాగు వంతెన వద్ద బుధవారం అదుపుతప్పి కెమికల్ లారీ ట్యాంకర్ బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎంకు తీసుకొస్తున్న కెమికల్ ట్యాంకర్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. ట్యాంకులోని రసాయన ద్రావణం నేల పాలైంది.

స్టేట్ మూడో ర్యాంక్ సాధించిన సోమగూడెం బాలిక



నవతెలంగాణ-కాసిపేట

బెల్లంపల్లి మండలం సోమగూడెం భరత్ కాలనీకి చెందిన గుజ్జుల సిరికుందన ఇంటర్ ఫస్టియర్‌లో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించి సత్తా చాటింది. బైపీసీ గ్రూప్లో ఇంటర్ ఫస్టియర్‌లో 440 మార్కులకు 436 మార్కులు సాధించి స్టేట్‌లో మూడో ర్యాంక్ సాధించింది. సిరికుందన తండ్రి గుజ్జుల రాజు పోలీస్ శాఖలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అధిక మార్కులు సాధించి స్టేట్ ర్యాంక్ సాధించడంపై తల్లిదండ్రులు గుజ్జుల రాజు, రజితలు ఆనందం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ వస్తేనే అభివృద్ధి



నవతెలంగాణ-బోథ్

కేంద్రంలో కాంగ్రెస్‌లో అధికారంలో కొస్తేనే నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర నాయకుడు ఏలేటి అశ్విన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బాబెర, నిగని, సోనాల వారసంతలో పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం చేపట్టారు. నాయకుడు దౌలత్‌రావు మోకాశితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఇప్పటివరకు నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ లింబాజి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సోనాల మండల అధ్యక్షులు గుడాల శేఖర్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు భోజన్న, నాయకులు రమణారెడ్డి, ముండే శ్రీధర్, పవన్, పోశెట్టి, మద్దెల మహేష్, సిర్పూర్ మహేష్ పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో ఇటీవల ఏనుగు దాడిలో మృతి చెందిన ఇద్దరు కుటుంబాలకు బుధవారం అటవీ అధికారులు పరిహారం చెక్కులు అందించారు. ఈ నెల మూడో తేదీన చింతలమానెపల్లి మండలం భూరెపల్లి గ్రామానికి చెందిన అల్లూరి శంకర్, మరుసటి రోజే నాలుగో తేదీన పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన కారు పోచం లపై ఏనుగు దాడి చేయగా వారిద్దరు మృతి చెందిన విషయం తెల్సిందే. మృతుడు అల్లూరి శంకర్ భార్య సుగుణకు, మరో మృతుడు కారు పోచన్న భార్య సుశీలకు కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎఫ్‌డీఓ అప్పలకొండ పరిహారం చెక్కులను అందించారు. ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కుతో పాటు మరో రూ. 5 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్, ఖర్జెల్లి, పెంచికల్‌పేట్ రేంజ్ అధికారులు రమాదేవి, చంద్రమౌళి, సుధాకర్, డిప్యూటీ రేంజ్ అధికారి ఇక్బాల్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు

నవతెలంగాణ-కామారెడ్డి

నేటి నుంచి కామారెడ్డి జిల్లాలో జరగబోయే తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలకు 11 సెంటర్లలో పరీక్షలు కొనసాగుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ 6 సెంటర్లో 1432 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తారని, పదవ తరగతిలో 5 సెంటర్లలో 927 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల 30 నిమిషాల వరకు అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాల్ టికెట్లు తీసుకోని అభ్యర్థులు www. Telanganaopenschool.org వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. పరీక్ష రాయడానికి వెళ్లే సమయంలో హాల్‌టికెట్, రైటింగ్ ప్యాడ్, పెన్స్, పెన్సిల్ వంటి రాత సామగ్రిని మాత్రమే తీసుకొని పోవాలన్నారు. సెల్‌ఫోను, క్యాలిక్యులేటర్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు ఎలాంటివి పరీక్ష హాల్లోకి అనుమతించబడవని పేర్కొన్నారు. అభ్యర్థులకు జారీ చేయబడిన పరీక్ష హాల్టికెట్లలో గాని, ఓఎంఆర్ సీట్ నందు గాని ఏమైనా ప్రింటింగ్ పొరపాట్లు ఉంటే సంబంధిత ఆధార పత్రాలతో ఇన్విజిలేటర్, చీఫ్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పరీక్ష కేంద్రాలలోని ముఖ్య పరీక్ష పర్యవేక్షణ అధికారి అనుమతి లేనిది ఎవరు పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించడం నిషిద్ధమని వివరించారు. పరీక్ష కేంద్రానికి చుట్టుపక్కల 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉన్నందున జన సమూహాలు ఎక్కువగా ఉండకూడదని, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5:30 నిమిషాల వరకు ఆ ఏరియాలలో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.